శుక్రవారం
14-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 53
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భారత్, అఫ్గాన్‌తో యుద్ధానికి సిద్ధం: పాక్

ఇస్లామాబాద్: భారత్‌ను రెచ్చగొట్టే విధంగా పాకిస్థాన్ వ్యవహరించింది. యుద్ధానికి సర్వ సన్నద్ధమంటూ రక్షణ మంత్రి ఖాజా ఆసిఫ్ ప్రకటించారు. తూర్పు సరిహద్దులోని భారత్, పశ్చిమ సరిహద్దులో తాలిబన్లతో యుద్ధానికి పూర్తిగా సిద్ధమని ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రెండు వైపులా యుద్ధానికి సిద్ధం. భారత్, అఫ్గాన్‌ను ఎదుర్కోగలం' అని ఆసిఫ్ అన్నారు. దిల్లీ పేలుళ్ల వేళ ఖాజా ఆసిఫ్ వ్యాఖ్యలు వైరలయ్యాయి. కాగా, రాజధాని ఇస్లామాబాద్‌లోని ఓ కోర్టు ఆవరణలో కారు బాంబు పేలి 12 మంది మరణించగా 36 మంది గాయలయ్యాయి. ఈ దాడికి తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ బాధ్యత వహించింది. ఈ దాడి వెనుక భారత్ ప్రమేయం ఉందని పాక్ ప్రధాని షరీఫ్ ఆరోపించడం విదితమే.

టెట్ నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నెల 29వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. జనవరి మూడో తేదీ నుంచి 31 వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా... జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్

- మిగతా 2 లో



ఆదేశాలు అమలు చేయకపోతే కోర్టుకు రండి

విశాలాంధ్ర - హైదరాబాద్: కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తున్న అధికారిపై రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చేప పిల్లలు పంపిణీ చేసిన వారికి నగదు చెల్లించాలంటూ గతంలో తామిచ్చిన ఆదేశాలను అమలు చేయకపోతే కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు హైకోర్టు తేల్చి చెప్పింది. 2023-24 సంవత్సరానికి తాము అందజేసిన ఫిష్ సీడ్స్‌కు సంబంధించిన నగదు చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ ఆరే ఫిషరీస్ ట్రేడర్స్

- మిగతా 2 లో

జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ అరెస్టు

న్యూదిల్లీ: మనీల్యాండరింగ్ కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ మనోజ్ గౌర్‌ను గురువారం ఈడీ అధికారులు అరెస్టు చేశారు. జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ సంస్థకు గతంలో మాజీ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్, సీఈవోగా చేశారు. జేపీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థకు మాజీ చైర్మెన్, ఎండీగా కూడా చేశారు. దిల్లీ, యూపీకి చెందిన ఆర్థిక నేర శాఖ దాఖలు చేసిన కేసు ఆధారంగా జేపీ గ్రూపుపై ఈడీ తనిఖీలు నిర్వహించింది. జేపీ విష్‌టౌన్, జేపీ గ్రీన్స్ ప్రాజెక్ట్ వద్ద ఇళ్లు కొన్నవారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. ఆ కంపెనీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ప్రభుత్వం... ప్రజలకే అంకితం

- జవాబుదారీగా ఉంటాం
- రైతులకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్
- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- విద్యారంగానికి పెద్దపీట
- మహిళలకు వడ్డీలేని రుణాలు
- 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం: భట్టి

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేస్తాం, ప్రజలకే జవాబుదారీగా ఉంటాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ముదిగొండ మండలంలో గురువారం కాకతీయ కాలంనాటి శివాలయ పునర్నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ... గత పాలకులు పదేళ్లపాటు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేసే వ్యవస్థను నెలకొల్పామన్నారు. రైతులకు ఉచితంగా 200 యూనిట్లు విద్యుత్ ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే అని వివరించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే అంత వేగంగా బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కళ్లు కాయలుకాచేలా పదేళ్లపాటు పేదలు ఇళ్లకోసం ఎదురు చూశారన్నారు. అధికారంలోకి రాగానే ఇల్లు లేని పేదలందరికీ ఐదు లక్షలతో ఇల్లు నిర్మిస్తామని చెప్పిన పాదయాత్రలో ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు ముదిగొండ మండలానికి చెందిన ప్రియాంకకు ఇల్లు కేటాయించామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 చొప్పున నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రభుత్వం ప్రతి పైసా ప్రజల అవసరాలకు ఖర్చు పెడుతుంది, ఎట్టి పరిస్థితుల్లో దోపిడీకి గురి కానివ్వం అన్నారు. మన బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యారంగానికి పెద్దపీట వేశామన్నారు. మెస్ చార్జీలు 20 శాతం, కాస్మోటిక్

- మిగతా 2 లో

పెట్టుబడులకు స్వర్గధామం

- అంతర్జాతీయస్థాయి మౌలికవసతులు
- పరిశ్రమలకు అనువైన వాతావరణం
- భారత్ ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం
- రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు
- భాగస్వామ్య సదస్సులో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేకుండా భౌగోళికంగా అగ్రస్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దిల్లీలో గురువారం జరిగిన 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య' సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ... దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామమని పేర్కొన్నారు. జీసీసీలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని

- మిగతా 2 లో

నేడు జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

విశాలాంధ్ర- హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లెక్కింపునకు సర్వం సన్నద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. యూసఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం లెక్కింపు ఏర్పాట్లపై గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తామన్నారు. నోటాతో కలిపి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఈసీఐ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని 42 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గరిష్టంగా 10 రౌండ్‌లు లెక్కిస్తారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను ఈసీఐ సాధారణ పరిశీలకులు , ఈసీఐ

- మిగతా 2 లో

టార్గెట్ డిసెంబర్-6

- 32 కార్లతో దిల్లీలో పేలుళ్లకు ఉగ్రవాదుల పథకం
- బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకార కుట్ర
- అల్-ఫలాహ్ యూనివర్సిటీలోనే పథక రచన
- దిల్లీ పేలుడు కేసులో దిగ్భ్రాంతి కొల్పే వాస్తవాలు

న్యూదిల్లీ: దిల్లీ ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు కేసు, ఫరీదాబాద్‌లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు కనుగొన్న కేసు దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ దిగ్భ్రాంతి గొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఈ ఘటన ఉగ్రవాద దాడిగా కేంద్రం ప్రకటించగా... నిందితులందరికి జైషే మహ్మద్ ఉగ్ర సంస్థతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. డాక్టర్లుగా ఉంటూ ఉగ్రవాదులుగా మారిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. కారు బాంబుతో ఆత్మాహుతి చేసుకున్న వ్యక్తిని కశ్మీర్‌కు చెందిన ఉమర్ నబీగా గుర్తించారు. నిందితుందరికి ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇక ఈ కేసులో పెద్ద కుట్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. డిసెంబర్ 6, బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన రోజున ప్రతీకారం తీర్చుకునేందుకు దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు ప్రణాళిక రచించారు. దీని కోసం 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారు. ఆరు దశల్లో ఒకేసారి బాంబు పేలుళ్ల జరపాలని ప్లాన్ చేశారు. ఇందుకోసం దిల్లీలోని ఆరు వేర్వేరు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకోవాలని భావించారు. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడులకు పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేశారు. బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ కార్లను పోలీసులు గుర్తించారు. సోమవారం దాడి సమయంలో హ్యుందాయ్ ఐ20కారును

- మిగతా 2 లో

పీఠం ఎవరిదో?

నేడు బీహార్ ఓట్ల లెక్కింపు
దేశవ్యాప్తంగా ఉత్కంఠ

పట్నా: దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామంలో ఏ కూటమిని విజయం వరించిందన్నది మరి కొన్ని గంటల్లో తేలిపోనుంది. గురువారం ఉదయం 8గంటల నుంచి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం 38 జిల్లాల్లో 46 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. ప్రతి కేంద్రం వద్ద రెండంచెల భద్రత వ్యవస్థ ఉంటుందని పేర్కొంది. అలాగే లెక్కింపు కేంద్రం లోపల కేంద్ర సాయుధ బలగాల పహారా ఉంటుందని వివరించింది. బయట బీహార్ పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తారని తెలిపింది. కేంద్ర పరిశీలకులతో పాటు అభ్యర్థులకు తరఫు ఏజెంట్ల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని... జిల్లా ఎన్నికల అధికారితో పాటు రిటర్నింగ్ అధికారులు క్రమం తప్పకుండా స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించాలని ఈసీ ఆదేశించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించేందుకు స్ట్రాంగ్ రూమ్‌లలోనే కంట్రోల్ రూమ్‌లను ఈసీ ఏర్పాటు చేసింది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు. బీహార్‌లో మొత్తం 243 స్థానాలుండగా ఈ నెల 6, 11న రెండు విడతల్లో పోలింగ్ జరిగిన సంగతి విదితమే. ఈ సారి రికార్డు స్థాయిలో 67.13 పోలింగ్ నమోదైంది. 1951 తర్వాత ఇదే అత్యధిక పోలింగ్ అని ఈసీ తెలిపింది. మహిళా ఓటర్లలో 71.78 శాతం, పురుషుల్లో 62.98 శాతం మంది ఓటు వేశారని వెల్లడించింది. రికార్డు స్థాయి పోలింగ్ జరగడంతో ప్రజల తీర్పు తమకే అనుకూలమంటూ అధికార ఎన్డీయే, ప్రతిపక్ష మహాఘట్బంధన్ రెండూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో ఎన్డీఏ నేతలైతే విజయం సాధించబోతున్నామన్న

- మిగతా 2 లో

మత్స్య పరిశ్రమాభివృద్ధికి
చిత్తశుద్ధితో కృషి

రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదలలో మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లో గురువారం ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చి 22 నెలలు గడిచిందని, పేద ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా నీటి వనరులలో చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్టు పాలేరు రిజర్వాయర్ లో రెండు సార్లు చేప పిల్లలను విడుదల చేశామని, మత్స్యకారుల విజ్ఞప్తి

- మిగతా 2 లో

కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

- ప్రజాసమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యం
- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ
- బీజేపీని అడ్డుకొనేందుకే కాంగ్రెస్‌తో పొత్తు: కూనంనేని

విశాలాంధ్ర- కాప్రా: భారత దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివ రావు అన్నారు. సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజంపై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయన్నారు. దానికి నిదర్శనం శ్రీలంకలో, న్యూయార్క్ లో కమ్యూనిజం అధికారంలోకి రావడమేనన్నారు. ఇప్పుడు నేపాల్‌లో అన్ని కమ్యూనిస్టుల ఐక్యం నిదర్శనమని అన్నారు. ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు, ధరలు తగ్గిస్తాం, ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తాం వంటి ప్రజాకర్షక నినాదాలతో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అవేమి అమలు చేయలేదన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటున్నదని ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ప్రజలు, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ఎల్ఐసీ, బ్యాంకులు, టెలికాం, గనులు, చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటుకు కట్టబెట్టిన చరిత్ర బీజేపీది అని ఉద్ఘాటించారు. దేశ సంపదను అదానీ, అంబానీ, కార్పోరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే... పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటి రద్దుకై సీపీఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులను చేయడానికి పోరాటాలు నిర్మిస్తామని అన్నారు. ఖమ్మంలో డిసెంబరు 26న సీపీఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు, ఐదు లక్షల మంది ప్రజలు హాజరుకానున్నారని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలిరావాలని కూనంనేని

- మిగతా 2 లో



ఆదాయ మార్గాలు అన్వేషించండి

- టికెట్లపై వ్యాపార ప్రకటనలు...
- నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలపై ప్రత్యేక కమిటీ
- త్వరలో ఉద్యోగులతో జూమ్ సమావేశం: మంత్రి పొన్నం

2 లో

ముగిసిన షట్‌డౌన్

నిధుల బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం

ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా ఆర్థిక 'షట్‌డౌన్'కు ఎట్టకేలకు తెర దించింది. షట్‌డౌన్‌ను ముగించే ప్రభుత్వ నిధుల బిల్లుపై ప్రతినిధుల సభలో ఓటింగ్ జరిగింది. 222-209 తేడాతో ఆమోదం లభించింది. సెనేట్ ఇంతకుముందే ఆమోద ముద్ర పడింది. ఇక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లుపై సంతకం చేశారు. దీంతో 43 రోజుల తర్వాత షట్‌డౌన్‌కు అధికారికంగా ముగింపు లభించింది. ఇన్ని రోజులు ఆర్థికపరంగా కార్యకలాపాలు స్తంభించడం అన్నది అమెరికా చరిత్రలో ఎప్పుడు జరగలేదు. దోపిడీకి లొంగేది లేదన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామంటూ ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. డెమొక్రాట్ల చర్యలు ఇలాంటి పరిస్థితి తీసుకొచ్చాయని చెప్పారు.

32 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు

భారత్, చైనా సహా అనేక దేశాలకు చెందిన 32 సంస్థలు, వ్యక్తులపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల ప్రోగ్రాంతో సంబంధమున్నట్లు పేర్కొంది. ఆయుధాలు తయారు చేయకుండా ఇరాన్‌ను కట్టడి చేయడంలో భాగంగా అధ్యక్షుడు ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. భారత్, చైనా, హాంగ్‌కాంగ్, యూఏఈ, టర్కీ, ఇరాన్‌తో పాటు ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తూ... ఇరాన్ బాలిస్టిక్ మిసైల్ అండ్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) ఉత్పత్తికి మద్దతిచ్చే బహుళ ప్రొకూర్‌మెంట్ నెట్‌వర్కులపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. అణు ముప్పు లేకుండా చేయడం కోసం ఇరాన్‌పై ట్రంప్ తీవ్రఒత్తిడి తెస్తున్నట్లు అమెరికా కార్యదర్శి జాన్ కె హర్లే అన్నారు. భారత్‌కు చెందిన ఫార్మ్‌లేన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్‌కు చెందిన మార్కో క్లింగె (క్లింగె)తో అమెరికా ట్రజరీ శాఖ ముడిపెట్టింది.

మా వాళ్లకు శిక్షణ ఇచ్చి పోండి: బెసెంట్

తమ దేశంలో ప్రతిభావంతుల కొరత ఉన్నట్లు అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించిన తర్వాత హెచ్-1బీ వీసాలపై అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వీసాలపై వచ్చిన వారు అమెరికన్లకు శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లాలన్నారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే అని తేల్చిచెప్పారు. ఇదే ట్రంప్ కొత్త విధానం అని వెల్లడించారు. 'విదేశీ కార్మికులపై ఎక్కువ కాలం ఆధారపడకుండా అమెరికన్లలో నైపుణ్యత పెంపొందించాలి. వారికి శిక్షణ ఇప్పించడం కోసం నైపుణ్యతగల విదేశీ కార్మికులను తాత్కాలికంగా అమెరికాకు తేవడమే కొత్త విధానం' అని అన్నారు. అమెరికా తయారీ రంగాన్ని పునరుద్ధరించేందుకు విజ్ఞాన బదిలీ (నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్)కి యత్నిస్తున్నట్లు తెలిపారు. సెమీకండక్టర్ పరిశ్రమను అమెరికాకు తేవాలని ఉందని బెసెంట్ వెల్లడించారు.

భారత్‌కు మా అవసరం లేదు: రూబియో

'ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడుపై దర్యాప్తునకు సహాయం చేస్తామన్నాం కానీ భారత్‌కు మా అవసరం లేదు' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. భారత అధికారులు వృత్తి నైపుణ్యంతో ఈ దర్యాప్తు సాగిస్తున్నారన్నారు. కెనడాలో జీ7 విదేశాంగ మంత్రుల సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌కు అమెరికా రాయబారి సెర్గియో గోర్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలు ఈ దు:ఖం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు పోస్టు పెట్టారు.

వారసత్వ సంపద జోలికి వస్తే సహించం

ట్రంప్ అల్లుడి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బెల్‌గ్రాడ్‌లో ప్రజాందోళన

బెల్‌గ్రాడ్: మా చరిత్ర, సాంస్కృతిక వారసత్వం మాకు ఎంతో ముఖ్యం, వాటి జోలికి వస్తే సహించేది లేదంటూ సెర్బియా రాజధాని బెల్‌గ్రాడ్‌లో ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాడు బాంబు దాడిలో ధ్వంసమైన యుగొస్లేవ్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌ను పడగొట్టి అక్కడ విలాసవంతమైన హోటల్ కాంపెక్స్ నిర్మించాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ప్రాజెక్టును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక భర్త జరేడ్ కుష్నెర్ చేపట్టనుండటంతో మరింతగా మండిపడ్డారు. వందల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ పునరాభివృద్ధి కోసం సెర్బియా పార్లమెంటు ఇటీవల ఆమోదం తెలిపింది. దీనిని అత్యవసర ప్రాజెక్టుగా పరిగణిస్తూ అతివేగంగా అనుమతులన్నీ జారీచేసింది. ఈ పరిణామం బెల్‌గ్రాడ్ ప్రజలకు కోపం తెప్పించింది. విద్యార్థుల అధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. వాస్తవానికి 1998-99 కొసోవో యుద్ధం ముగించేందుకు అమెరికా నేతృత్వ నాటో జరిపిన బాంబు దాడుల్లో ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ధ్వంసమయ్యాయి. 60 ఏళ్ల ఈ కట్టడంతో ప్రజల మనోభావాలు ముడిపడి ఉన్నాయి. అమెరికా దేశాధినేత అల్లుడికి అక్కడ హోటల్ కంపెక్స్ నిర్మాణానికి తమ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ప్రజలకు మరింతగా కోపం తెప్పించింది. నేరానికి చట్టబద్ధత కల్పించేందుకు ఈ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని నిరసనకారులు ఆరోపించారు. చట్టబద్ధంగా భవనాన్ని కూల్చేయగలరు కానీ మేము అందుకు ఒప్పుకోమంటూ హెచ్చరించారు. మా చరిత్ర, సాంస్కృతిక వారసత్వం మాకు ఎంతో ముఖ్యం. దాని జోలికి వస్తే ఊరుకోం అంటూ ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. కుష్నెర్‌కు చెందిన అఫినిటీ పార్టనర్స్ కంపెనీ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ స్థలాన్ని 99 ఏళ్ల కోసం 2024లో లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందానికి ముందు ఆ ప్రాంతానికి ఉన్న సాంస్కృతిక వారసత్వ సంపద హోదాను అక్కడి అధికారులు రద్దు చేశారు. అయితే మే నెలలో అఫినిటీ పార్టనర్స్ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఈ స్థలానికి ఉన్న రక్షణను తొలగించేందుకు తప్పుడు పత్రాలు వినియోగించినట్లు ఆరోపణలు రావడంతో, దీనిపై విచారణ మొదలైంది. కాగా, గతేడాది నవంబరులో రైల్వేస్టేషన్ వద్ద ఘటనతో అవినీతి పాలన అంటూ అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్‌పై ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

పీఠం ఎవరిదో?

(మొదటిపేజీ తరువాయి)

అతి విశ్వాసంతో సంబరాలకు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ముఖ్యమంత్రి నితీశ్ నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనను అందించినందువల్లే ప్రజలు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి మద్దతు తెలిపారని ఎన్డీయే నేతలు చెబుతున్నారు. అయితే ఓటర్లు మార్పు కోరుకున్నారనటానికి భారీ పోలింగే నిదర్శనమని ఆర్జేడీ నేతలు అంటున్నారు.

పోలింగ్‌శాతం పెరిగిన ప్రతిసారీ అధికార మార్పిడి

కాగా బీహార్‌లో పోలింగ్ శాతం 5పాయింట్ల కంటే ఎక్కువ పెరిగిన మూడుసార్లు అధికార మార్పిడి జరిగింది. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఓటింగ్ శాతం 9.84 పాయింట్లు పెరిగింది. దీంతో ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగుతుందా అనే ఆసక్తి నెలకొంది.

నేడు జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

(మొదటిపేజీ తరువాయి)

బృందం పరిశీలిస్తారని చెప్పారు. లెక్కింపు ప్రక్రియకు 186 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్ లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ ఉంటారని అన్నారు. ఎల్‌ఈడి స్క్రీన్ ద్వారా, ఈసీ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు, కౌంటింగ్ ఏజెంట్ లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని కర్ణన్ స్పష్టం చేశారు. జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ... ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం, విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలతో రైతులకు గిట్టు బాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎక్కువ... బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకున్నామన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నా ప్రజా సమస్యలపై పోరాటం ఆపడం లేదని... ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్, జాతీయ సమితి సభ్యులు యూసఫ్ మాట్లాడారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి, స్వామి, కిషన్, శంకరరావు, హరినాథరావు, కృష్ణ, సత్యప్రసాద్, యాదయ్య గౌడ్, లొట్టి ఈశ్వర్, సల్మాన్ బేగ్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలు అమలు చేయకపోతే కోర్టుకు రండి

(మొదటిపేజీ తరువాయి)

అండ్ సీడ్ సప్లయర్స్ యజమాని రాజ్‌కుమార్, ఇతరులు వేర్వేరుగా పిటిషన్లు వేశారు. వీటిని జస్టిస్ కాజ శరత్ గురువారం విచారించారు. తమ ఆదేశాలు అమలు చేస్తారా లేక కోర్టుకు హాజరవుతారా అని ప్రశ్నించారు. ఈ కేసులో ఫిబ్రవరిలోనే ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అమలు చేయలేదని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. చివరిసారిగా నాలుగు వారాలు గడువు ఇస్తున్నట్టు ప్రకటించింది. తదుపరి విచారణను డిసెంబరు ఐదో తేదీకి వాయిదా వేసింది.

టెట్ నోటిఫికేషన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే... టీచర్లంతా ఈ టెట్ ఉత్తీర్ణత కావాల్సి ఉంది.

మత్స్య పరిశ్రమాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

(మొదటిపేజీ తరువాయి)

మేరకు 15 రోజులలో పెద్ద సైజ్ గల రొయ్య పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 101 మీడియం, మేజర్ రిజర్వాయర్లలో విడుదల చేస్తామని వివరించారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అనంతరం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో 90 మంది లబ్ధిదారులకు రూ.37,97,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఖమ్మం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కూసుమంచి మండల తహసిల్దార్ రవి కుమార్, ఎంపీడీవో, ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస

నాటు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన ఢాకా

బస్సులకు, గ్రామీణ బ్యాంకు కార్యాలయానికి నిప్పు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసులలో సోమవారం (17వ తేదీ) ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ తీర్పు వెలువడనుంది. దీంతో రాజధాని ఢాకాలో నాటు బాంబు పేలుళ్లు సంభవించాయి. అనేక ప్రాంతాలలో ఆస్తులు, బస్సులకు నిప్పుపెట్టిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తూర్పు బ్రహ్మనబరియాలోని గ్రామీణ బ్యాంకు శాఖ కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఢాకాలో వినియోగంలోని రైలు పెట్టును తగలబెట్టారు. రైల్వే స్టేషన్ పరిసరాలలో చిన్నపాటి పేలుళ్లు జరిగాయి. ఢాకా యూనివర్సిటీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో నాటు బాంబులు పేలాయి. బస్సులు తగలబడ్డాయి. షేక్ హసీనా నేతృత్వ అవామీ లీగ్ గురువారం ఢాకాలో లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. దీంతో యూనస్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాజధాని నగరంలో భద్రత కట్టుదిట్టం చేసింది. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ వద్ద బందోబస్తు పెంచింది. పోలీసులు, సాయుధ దళాలను భారీగా మోహరించింది. ఢాకాలోకి ప్రవేశమార్గాల్లో చెక్ పాయింట్లు పెట్టి తనిఖీలు ముమ్మరంగా చేసింది.

ఫిబ్రవరిలో ఎన్నికలు... అదే రోజు ప్రజాభిప్రాయ సేకరణ

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు చారిత్రక 'జులై చర్టర్' అమలునకు యూనస్ ప్రభుత్వం దేశవ్యాప్త రిఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ)ను చేపట్టనుంది. ఈ మేరకు యూనస్ గురువారం ప్రకటించారు. ఆయన దేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 2026 ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు పండుగ వాతావరణంలో నిర్వహించుకుందామని అన్నారు. పార్లమెంటరీ ఎన్నికల రోజునే జులై చార్టర్‌పై రిఫరెండం జరుగుతుందన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతాయని హామీనిచ్చారు. యువతకు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేలా మేనిఫెస్టోలు, ప్రభుత్వ ప్రణాళికలు ఉండాలని రాజకీయ పార్టీలకు సూచించారు. రాజకీయ అంశాలు, రాజ్యాంగం, పాలనా సంస్కరణలను ప్రతిపాదించిన 26 అంశాలతో కూడిన జులై చార్టర్‌ను అనేక రాజకీయ పార్టీలు అంగీకరించాయి. నేషనల్ సిటీజన్స్ పార్టీ (ఎన్‌సీపీ)తో పాటు నాలుగు వామపక్ష సంఘాలు మాత్రం బహిష్కరించాయి. జులై చార్టర్‌లో ప్రతిపాదించిన సంస్కరణల అమలునకు చట్టబద్ధమైన హామీ లేదని, అందుకే వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నాయి. కాగా, బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత నడుమ తాజా ప్రకటన వెలువడటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆదాయ మార్గాలు అన్వేషించండి

విశాలాంధ్ర - హైదరాబాద్: మహాలక్ష్మీ పథకం ద్వారా సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ... టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో గురువారం ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారన్నారు. రూ.7,980 కోట్లు ఆర్టీసీ కి ప్రభుత్వం చెల్లించిందన్నారు. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి ఆ సంస్థ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బస్సులు, బస్ స్టేషన్‌లలో టికెట్ పై వ్యాపార ప్రకటనల ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు. నష్టాల్లో కొనసాగుతున్న తాండూరు, వికారాబాద్, బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్‌సుఖ్‌నగర్, హకీంపేట్ , రాణిగంజ్ , మిథానితో పాటు వివిధ డిపోలు నష్టాల్లో ఉండడానికి గల కారణాలు, లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి ఆదేశించారు. నగరంలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పీఎం ఈ -డ్రైవ్ కింద హైదరాబాద్‌కి కేటాయించిన రెండు వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్ల సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు వద్ద నివసిస్తున్న వేలాది మందికి రవాణా సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వెయ్యి మంది డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టుల నియామకాలు పారదర్శకంగా పూర్తి చేయాలని చెప్పారు. నెల రోజుల్లో 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ ,114 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందని, నియామక ప్రక్రియ టీజీపీఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద చేరిన ఆర్టీసీ కండక్టర్లకు ఉన్న మూడు సంవత్సరాల ప్రొవిజన్ రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మేడారం జాతర సమీపిస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం , పెద్దపల్లి జిల్లా బస్సు డిపో పనుల పురోగతి పై అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల లోపు మంథని బస్ స్టేషన్ ఆధునీకరణ పూర్తి కావాలని ఆదేశించారు. మధిర బస్ స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. మిర్యాలగూడ అప్ గ్రేడేషన్ పనులు ప్రారంభించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ నిర్మాణం , బస్ సౌకర్యాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రమాదాలను తగ్గించడానికి లహరి , రాజధాని , గరుడ బస్సుల్లో అమలవుతున్న డ్రైవర్ మానిటరింగ్ పని తీరును అడిగి తెలుసుకున్నారు. హైర్ బస్సుకి ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి నిర్ణయాన్ని కఠినతరం చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లకు నిరంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి వెల్లడించారు. తార్నాక హాస్పిటల్‌లో రోగుల బంధువుల కోసం ఏర్పాటు చేస్తున్న డార్మిటరీ రూం ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ ఫంక్షన్ హాల్ లు వస్తున్న ఆదాయం ఖర్చులు వివరాల పై ఆరా తీశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టార్గెట్ డిసెంబర్-6

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించారు. పోలీసులకు ట్రేస్ చేసినా దొరక్కుండా ఎక్కువ సార్లు చేతులు మారిన కార్లను ఉగ్ర డాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు హర్యానా ఫరీదాబాద్‌లో గుర్తించారు. బ్రెజ్జా కారును మహిళా వైద్యురాలు షాహినా సయీద్ వాడినట్లు కనుగొన్నారు. ఈమెనే జైషే మహ్మద్ ఉగ్రసంస్థ మహిళా విభాగానికి ఇండియాలో హెడ్‌గా పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. బ్రెజ్జా కారును హర్యానాలోని ఫరీదాబాద్‌లోని అల్-ఫలా స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో గుర్తించారు. ఈ కేసులో ఉగ్రవాద డాక్టర్లు- ఆదిల్ అహ్మద్ రాథర్, ముజమ్మిల్ షకీల్, సాహినా సయీద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

కారులో లభ్యమైన డీఎన్ఏ డా.ఉమర్ నబీదే...

ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన కారులో లభించిన నమూనాలతో డాక్టర్ ఉమర్ నబీ డీఎన్ఏ మ్యాచ్ అయినట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ ల్యాబ్ ఈ విషయాన్ని ధ్రువీకరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. పేలుడుకు ముందు ఉమర్ కారు నడుపుతున్న సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. దీంతో ఘటన సమయంలో కారులో ఉన్న ఉమర్ కూడా ప్రాణాలు కోల్పోయి ఉంటాడని అధికారులు అనుమానించారు. ఈ క్రమంలోనే పుల్వామాలోని అతడి కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకొని పరీక్షించారు. తాజాగా కారు నుంచి లభ్యమైన డీఎన్ఏ ఉమర్ నబీదేనని తేలినట్లు తెలుస్తోంది.

మరో డాక్టర్ అరెస్టు

ఢిల్లీ బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు క్రమంలో మరో కీలక అరెస్ట్ జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో వైద్య విద్యార్థి(కార్డియాలజిస్ట్) డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ (32)ను యూపీ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) అదుపులోకి తీసుకుంది. జమ్మూకాశ్మీరులోని అనంత్ నాగ్ వాస్తవ్యుడైన ఆరిఫ్... మూడు నెలల క్రితమే కాన్పూర్‌లోని గణేశ్ శంకర్ విద్యార్థి మెమోరియల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కార్డియాలజీ మొదటి సంవత్సరం కోర్సులో చేరాడు. డాక్టర్ షాహీన్ ఈ కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న షాహీన్ దర్యాప్తు క్రమంలో ఆరిఫ్ పేరును వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఆరిఫ్‌ను అరెస్టు చేసి, ప్రశ్నించేందుకు రహస్య ప్రదేశానికి తరలించారు.

రూం నంబర్ 13లో ప్లానింగ్

హర్యానాలోని అల్ ఫలా యూనివర్సిటీలో దర్యాప్తు అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇప్పటికే అరెస్టైన డాక్టర్ ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్రకుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను ఉమర్, ముజమ్మిల్ సేకరించినట్లు తెలిసింది. ఈ గదిలో సోదాలు జరిపిన పోలీసులు కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అటు ముజమ్మిల్‌తో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గదిలో సోదాలు చేసిన అధికారులు మూడు డైరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ డైరీలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో వరుస పేలుళ్లకు వీరు ప్రణాళికలు చేసినట్లు గుర్తించారు. 4 నగరాల్లో ఇద్దరు చొప్పున మొత్తం 8 మంది పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలిపారు. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇందుకోసం నిందితులు దాదాపు 26 లక్షల వరకు నిధులు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇవ్వగా... రూ.3 లక్షల విలువైన 20 క్వింటాళ్లకుపైగా ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూహ్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఈ పదార్థాలను వినియోగించి వారు ఐఈడీ బాంబులను తయారుచేయాలని ప్లాన్ చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, వీరి కుట్రలను పోలీసులు భగ్నం చేశారని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి.

పెట్టుబడులకు స్వర్గధామం

(మొదటిపేజీ తరువాయి)

సీఎం చెప్పారు. మూసీ నదీ పునరుజ్జీవం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్ -ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన సీఎం... చైనా వన్ మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని... హైదరాబాదులో ఆ ట్రెండ్‌ను మార్చి ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యుఎస్ఐఎస్పీఎఫ్ వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. యుఎస్ఐఎస్పీఎఫ్ అధ్యక్షుడు డా. ముఖేష్ ఆఘి ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబరు ఎనిమిది, తొమ్మిది తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతామని చెప్పారు.

ప్రభుత్వం... ప్రజలకే అంకితం

(మొదటిపేజీ తరువాయి)

చార్జీలు 200 శాతం పెంచామని తెలిపారు. ప్రతి బిడ్డ ప్రపంచంతో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అసెంబ్లీకి ఒకటి చొప్పున నిర్మిస్తున్నామన్నారు. రూ.2,500 కోట్లతో 25 ఎకరాల్లో ప్రతి పాఠశాల నిర్మాణం జరుగుతుంది అన్నారు. ఇందులో భాగంగా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి అన్నారు. మహిళలంతా ఆత్మగౌరవంతో బతకాలని వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మధిర నియోజకవర్గంలో 60 వేల మంది మహిళా సభ్యులు ఉన్న ఇందిరా మహిళ డైరీ దేశానికి తలమానికంగా ఉండబోతోందన్నారు. రెండు సంవత్సరాల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, లక్షలాది సంఖ్యలో ప్రైవేటు ఉద్యోగాల భర్తీ కోసం యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పదేళ్లు పాలించి గ్రూప్- 1, గ్రూప్-2 నిర్వహించలేకపోయారని విమర్శించారు. అధికారంలోకి రాగానే గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించామన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాను, మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు.

జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.12 వేల కోట్ల మేర మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పీఎంఎల్ఏ చట్ట కింద గౌర్‌ను అరెస్టు చేశారు. ఇళ్లు కొనుగోలు చేసిన వారి డబ్బులను దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఆ నిధులను దారిమళ్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

అభయారణ్యాల వద్ద మైనింగ్‌పై 'సుప్రీం' నిషేధం

న్యూఢిల్లీ: జాతీయ ఉద్యానవనాలు, వన్యప్రాణుల అభయారణ్యాల సరిహద్దుల నుంచి కిలోమీటర్ పరిధిలోని అన్ని మైనింగ్ కార్యకలాపాలను సుప్రీంకోర్టు గురువారం నిషేధించింది. ఇలాంటివి అటవీ జీవులకు హానికరమని పేర్కొంది. జార్ఖండ్‌లోని సారంద వన్యప్రాణుల అభయారణ్యం, ససంగ్‌దాబురు కన్జర్వేషన్ రిజర్వ్‌కు సంబంధించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. రక్షిత ప్రాంతాల నుంచి ఒక కిలోమీటరు పరిధిలోని మైనింగ్ కార్యకలాపాలు వన్యప్రాణులకు ప్రమాదకరమని కోర్టు స్పష్టం చేసింది. గోవా ఫౌండేషన్ కేసులో ఇలాంటి ఆదేశాలు ఇచ్చింది. అలాంటి ఆదేశాలను ప్రస్తుతం మొత్తం దేశానికి మార్గదర్శకాలను విస్తరించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అభయారణ్యాల సరిహద్దుల నుంచి కిలోమీటరు పరిధిలో మైనింగ్‌ను ఇకపై అనుమతించొద్దని జార్ఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. గిరిజనుల హక్కులను అటవీ హక్కుల చట్టం కింద తప్పనిసరిగా రక్షించాలని కూడా స్పష్టం చేసింది. గతంలో సారండా ప్రాంతాన్ని రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌గా ప్రకటించడంపై నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ప్రభుత్వానికి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో 31,468.25 హెక్టార్ల అసలు ప్రతిపాదనతో పోలిస్తే... ప్రస్తుతం 57,519.41 హెక్టార్ల విస్తీర్ణాన్ని వన్యప్రాణుల అభయారణ్యంగా ప్రకటించాలని ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొంది.

జిల్లా పీఆర్వోను అభినందించిన ఎస్పీ

విశాలాంధ్ర-వనపర్తి: హైదరాబాదులోని పేట్లబుర్జ్ సిటీ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో మూడు రోజులపాటు జరిగిన పీఆర్వోల శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి శిబిరంలో ప్రతిభ కనబర్చిన పీఆర్వోలను అభినందించి, ప్రశంస పత్రాలు అందజేశారు. వనపర్తి జిల్లా పీఆర్వో ఎస్. రాజ గౌడ్ అద్భుత ప్రతిభ కనబర్చినందుకు తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నందున గురువారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, పిఆర్వో రాజా గౌడ్‌ను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పీఆర్వో ప్రజలతో పోలీసులను కలిపే వంతెనలు కావాలి. ప్రతి సంఘటనలో పోలీసుశాఖ నిజమైన రూపాన్ని సమాజానికి చేర్చడం మీ ముఖ్యమైన బాధ్యత అని ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ఉండాలని సమాచారం స్పష్టంగా, సమయానికి అందించడం ద్వారా పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరుగుతుందని ఈ సోషల్ మీడియా యుగంలో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ ఎంతో కీలకం అని ఎస్పీ అన్నారు.

సింగరేణి శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సింగరేణి ఆర్జీవన్ కార్యాలయం ఆవరణలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని గురువారం శిశు సంరక్షణా కేంద్రం పారంభించారు. అంతకు ముందు బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా అందరితో నాణ్యత ప్రమాణాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సిబ్బంది వారి చిన్న పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పిల్లలు సురక్షితమైన, శుభ్రమైన ఆటలతో కూడిన వాతావరణాన్ని సకల సదుపాయాలతో కల్పించారని, మహిళా ఉద్యోగులు ఆందోళన లేకుండా పని చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా బొగ్గు నాణ్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, దానివల్ల కంపెనీ విశ్వాసనీయత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమలో జనరల్ మేనేజర్ డి.లలిత్ జనరల్ మేనేజర్ క్వాలిటీ రామగుండం రీజియన్, ముజుందార్, జనరల్ మేనేజర్ సేఫ్టీ రామగుండం రీజియన్ ఎస్ మధుసూదన్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, మద్ది ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రెటరీ శ్రీ అరెల్లి పోశం, అధికారులు చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి,ఎల్.రమేశ్,ధనలక్ష్మి,వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యం నింపిన మహనీయుడు కాళోజి

విశాలాంధ్ర-తుంగతుర్తి: ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు కాళోజి నారాయణరావు అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మహనీయుడు కాలేజీ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ... సమాజంలోని అన్యాయాలకు అణచివేతలనే ఇతివృత్తంగా చేసుకొని తన రచనలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పరితపించిన అక్షర తపస్వి కాళోజి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగానీ రాములు గౌడ్, గోపగాని శ్రీనివాస్, కోదాడ మాజీ కౌన్సిలర్ లలిత, రమేష్, వెంకన్న, తడకమల్ల రవికుమార్, వెంకటేష్, మహేందర్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ అరవింద్ కాలనీలో 25 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులకు గురువారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతులమీదుగా శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, స్థానిక మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరప్ప, 13వ డివిజన్ ఇంచార్జి జెన్న రాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి సఖి మహిళల వితరణ

విశాలాంధ్ర - మణుగూరు : పట్టణంలో సఖి మహిళా మండలి చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలైన యేసు మణి ఆర్థిక కష్టాల్లో ఉండగా గుర్తించిన సఖి మహిళా మండలి గురువారం బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులు అందించారు. నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల స్వరూప ఆ వృద్ధురాలి విషయం నేషనల్ కోఆర్డినేటర్ జన్నా స్వర్ణలత దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమెకు నెలకు సరిపడా నిత్యా వసరాలు అందించారు. కార్యక్రమంలో జన్నా స్వర్ణలత, గైని లక్ష్మీబాయి, వేముల స్వరూప, పెంట్యాల దీప్తి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ ఇసుక ఫిల్టర్లపై దాడులు

విశాలాంధ్ర - ఆమనగల్లు, :: ఆమనగల్లు మండలంలో కృతిమ ఇసుక (ఫిల్టర్ ఇసుకను) తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్. ఐ బి వెంకటేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి, గౌరారం, శెట్టిపల్లి గ్రామాలలో కృతిమ ఇసుక తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం కృతిమ ఇసుక తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి. జెసిబి ల సాయంతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఫిల్టర్ నిర్వాహకులు ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిల్టర్ ఇసుక తయారీ, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రామ్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు

పేదోడి సొంతింటి కల నెరవేర్చాలి: కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: పేదలకు గృహ సదుపాయం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ దేశించారు. హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రామస్వామిగుట్ట వద్ద జరుగుతున్న సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఇందిరమ్మ కాలనీని సందర్శించి గృహాలు, రోడ్లు, నీటి సంపులు, సెప్టిక్ ట్యాంకులు, విద్యుత్ సరఫరా వంటి పనులను పరిశీలించారు. నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. 'ఏటీసీ ద్వారా మీరు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుని ఉపాధి పొందాలి, జీవితంలో స్థిరపడాలి'అని ప్రోత్సహించారు. వేపలసింగారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీరియల్ రిజిస్టర్ పరిశీలించి ఇప్పటి వరకు 14 మంది రైతులు ధాన్యం తీసుకువచ్చినట్టు సమాచారం అందించారు. హుజూర్నగర్ ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో మొత్తం 338 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. రైతులు ప్రభుత్వ కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువస్తే, మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ కూడా లభిస్తుంది' అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సిధార్థ, ఎంపీడీఓ సుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీఈ జంగయ్య, డీటీ నాగేందర్, ఏఈ సాయిరాం రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, పీఏసీఎస్ సీఈఓ వీరబాబు, సెంటర్ ఇన్‌చార్జ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీయడమే యువజనోత్సవాల లక్ష్యం: కలెక్టర్

విశాలాంధ్ర-బ్యూరో,నిర్మల్ జిల్లా: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, జీవి తంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా: గురువారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సీఐ సీహెచ్ అజయ్ పట్టణ కేంద్రంలోను సదర్మాట్ కాలువ సమీపంలోనూ నిషేధ గంజాయి విక్రయాలు జరుపు తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన పుట్ట మనోహర్, సుభాష్ నగర్ కాలనీకి చెందిన భోదాసు రాము అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారంతో వారిని పట్టుకున్నట్టు సీఐ తెలిపారు. సుమారు 3 కిలోల నిషేధిత గంజాయిని స్వాధీన పరిచయం, వారిని రిమాండ్ కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఉన్నాడని అతన్ని కూడా అదుపులోకి తీసుకుంటామని సీఐ వెల్లడించారు. నిషేధ గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయాలు జరిపినా.. వాటికి ప్రోత్సహించిన వారు ఎంతటి వారైనా కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు. విద్యార్థులు గంజాయికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి పండించినట్టు లేదా విక్రయించినట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, రెండో ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు

ఖమ్మంలో విస్తృతంగా పోలీసు తనిఖీలు

విశాలాంధ్ర-ఖమ్మం (క్రైమ్): కమ్మనగరంలో నగర ఎసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా సీపీ సునీల్ ఆదేశాలతో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇతనికిల ద్వారా నేరాల నియంత్రణ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు, దొంగతనాలు నియంత్రణలో వుంటాయన్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అవసరం లేకున్న అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న అనుమానిత వ్యక్తులు, వాహనాలు తారసపడితే వాటి గురించి పూర్తి వివరాలను సేకరించి సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నారు.అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి , రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణా,పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

అన్ని పంచాయతీల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - గుండాల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో రైతుల సౌకర్యం కోసం మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఐ మండల నాయకులు ఎస్కే సాహెబ్ డిమాండ్ చేశారు. గుండాల మండల కేంద్రంలోని అధిక శాతం రైతులు దశబ్దాలుగా వర్షాధార పంటలైన మొక్కజొన్న, వరి మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ ఏజెన్సీ మండలంలో సాగునీటీ సౌకర్యాలు అంతగా లేవన్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఈ మధ్య అకాల వర్షాల కారణంగా చాలా మంది రైతులు భారీ నష్టాన్ని చవి చూశారని తెలిపారు. ప్రభుత్వం బాధిత రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. ఆరుగలం కష్టించే రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలన్నా, దళారిల బారిన పడకుండా ఉండాలన్నా ప్రతి పంచాయతీలోనూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చెయ్యాల్సి ఉందన్నారు. పండిన ప్రతి గింజ ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామ పరిధిలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ొ% రైతులు కొనుగోలు కేంద్రానికి తేమ తక్కువ ఉండి,చెత్తాచెదారం లేని నాణ్యత గల పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని తెలిపారు.రైతులకు నిబంధనల ప్రకారం పూర్తి సహాయ సహకారాలుఅందిస్తామని తెలిపారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహ , వైస్ చైర్మన్, గూడూరు భాస్కర్ రెడ్డి డైరెక్టర్స్ వస్పుల శ్రీశైలం,రమేష్ గౌడ్, జంగయ్య గౌడ్,ఉడుతల యాదయ్య, శ్యాంసుందర్ రెడ్డి,సీపీఓ రాజీవ్, మీల్ ఓనర్ అనంతరెడ్డి. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు నేతలపై కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - దమ్మపేట : రైతుల పక్షాన నిలబడి మొక్కజొన్న కొనుగోలు కోసం పోరాటం చేసిన సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్, ఎఐయుకేఎస్ నాయకులపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో మొక్కజొన్న పంట భారీ తుఫాన్ ల వర్షాలతో అతివృష్టి కారణంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తమ పార్టీ నేతలు డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తే కేసులు ఎలా బనాయిస్తారని ప్రశ్నించారు. మధ్యవర్తులు, దళారులు రైతులను మోసం చేస్తుండగా సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం నాయకులపై అక్రమ కేసులు మోపడం అన్యాయమన్నారు. పెట్టిన కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక లారీలతో భారీ ట్రాఫిక్ జామ్

అంబులెన్స్‌కూ దారివ్వని వైనం

విశాలాంధ్ర - పినపాక : ఈ ప్రాంతంలో ఇసుక లారీలు ప్రజలకు ఒక శాపంలా మారాయి. బడా బాబులు అధికార పార్టీ అండతో నిబంధనలకు విరుద్ధంగా గిరిజన బినామీ సంఘాల పేర ఇసుక ర్యాంపులు పొందారు. ఈ ర్యాంపుల నుంచి నిత్యం భారీ స్థాయిలో లారీలు హైదరాబాద్ తరలి వెళ్తున్నాయి. నకిలీ వే బిల్లులతో హైదరాబాద్ కు అక్రమంగా తరిస్తుండగా మణుగూరు పోలీసులు పట్టుకొని కేసులు పెట్టిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ అక్రమ దందా కొనసాగుతూనే ఉందని తెలుస్తుంది. గురువారం గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గుండ్ల సింగారం, అనంతారం, పద్మ గూడెం, అన్నారం గ్రామాల ఇసుక ర్యాంపుల నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. గురువారం ఈ ర్యాంపుల నుంచి ఒకేసారి పెద్దఎత్తున ఇసుక లోడ్ తొ రోడ్డెక్కిన లారీలు మణుగూరు సీఎస్పీ కాటా వద్ద ప్రధాన రహదారి పై అడ్డదిడ్డంగా ఆపారు. దింతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయింది. నిత్యం ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గంటల తరబడి మోటార్ సైకిళ్ల తో పాటు ఆటోలు, కార్లు, బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో వెళుతున్న అంబులెన్స్ కూడా దారి దొరక్క నిలిచి పోయింది. వాహన దారులు భరించ లేక 100, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. చాలాసేపు వరకు అధికారులు ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. దీంతో ఆగ్రహం చెందిన చాలామంది ప్రజలు ఇసుక అక్రమాలపై ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై అక్రమ దందాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ పరిణామాలు స్థానిక ప్రజలకు శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న అవగాహన

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: నల్లగొండ జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్నమైన పద్ధతిలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. నేషనల్ హైవే-65లోని చిట్యాల మండలం వెలిమినేడు వద్ద 'నీ వాహనం వేగంగా వెళ్తుంది. కానీ నీ జీవితం ఆగిపోతుంది' అనే నినాదంతో ప్రత్యేక హోర్డింగ్ ఏర్పాటు చేశారు. యాక్సిడెంట్‌కి గురైన కారును ప్రదర్శనగా ఉంచి వాహనదారులకు రోడ్డు భద్రతపై సందేశం అందించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరం. అతివేగంగా వాహనం నడపడం, సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి నిర్లక్ష్యాలు అనేక ప్రాణాలను బలితీసుకున్నాయి" అని తెలిపారు. వాహనదారులు రోడ్డు సూచికలను గమనిస్తూ, వేగపరిమితిని పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. ఇలాంటి హోర్డింగులు చూసి ప్రజలు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడానికి ప్రేరణ పొందుతారని అన్నారు. జిల్లా పోలీసులు తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల కారణాలను విశ్లేషిస్తున్నారని ఎస్పీ తెలిపారు. అవసరమైన చోట రోడ్డు సూచికలు, సిగ్నల్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, చిట్యాల సీఐ నాగరాజు, ఎస్ఐ మధు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాళోజి, అందెశ్రీలకు ఘన నివాళి

విశాలాంధ్ర-గూడూరు: మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికల) యందు సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు వర్ధంతి, అందెశ్రీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి అమృత, రామయ్య మాట్లాడుతూ కాళోజి తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా, రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం, కవిత్వం రాసిన ప్రజాకవి, హక్కులడిగిన ప్రజల మనిషి, ఉద్యమం నడిపిన ప్రజావాది అన్నారు. అందెశ్రీ తెలంగాణ రచయిత, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతం రచించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అందుకుగాను 2025 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా కోటి రూపాయల పురస్కారం అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న ఉపాధ్యాయులు వి.ప్రసాద్, ఆల్ ఇండియా ఆదివాసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు అయిలబోయిన వీరయ్య, ఎ.రమాదేవి, సిహెచ్ ఉమారాణి, ఎం.శ్రీను, ఏ విజయ, పి అమృత, విజయ, సుధాకర్, సిహెచ్ స్వప్న, బి ఝాన్సీరాణి, బి జానయ్య, జి భారతి ,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: నాగులు

విశాలాంధ్ర-నేరేడుచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో ఉచితంగా నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మండలంలోని పెంచికల్ దిన్నె చెరువులో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులు పాల్గొని చేప పిల్లలను చెరువులో వదిలారు. ఆయన మాట్లాడుతూ "మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసి, వారి కుటుంబాల జీవనోపాధికి తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని, ఈ సదవకాశాన్ని మత్స్యకారులు పూర్తిగా ఉపయోగించుకోవాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సోమసుందర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ ఉద్యోగులు రోజా, సుమలత, సతీష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పొలిశెట్టి శ్రీనివాస్ అలాగే గ్రామ పెద్దలు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఆర్.కె., గ్రామ అధ్యక్షులు పెరుగు నాగరాజు, సిద్దపంగ సైదులు, పెండెం హరిబాబు, నాయకులు మర్రి నాగేశ్వరరావు, అల్వాల శ్రీధర్, సొసైటీ సభ్యులు సిరికొండ నాగయ్య, యామగాని లచ్చయ్య, సిరికొండ మట్టయ్య, ఇంజమూరి వెంకటయ్య, యామగాని రాంబాబు, గుడుగుంట్ల లింగయ్య, రాచూరి నాగేశ్వరరావు, కుక్కడపు రామారావు, కుక్కడపు ఉషా, యామగాని నరేష్, చిలకరాజు శ్రీను, జాను షేక్ మల్సూర్, యామగాని శ్రీను, దూపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు: డీఈఓ

విశాలాంధ్ర-జిల్లా బ్యూరో మహబూబాబాద్ : రానున్న పరీక్షలకు విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో సన్నద్ధం కావాలని జిల్లా విద్యాధికారి సిహెచ్ మదార్ గౌడ్ అన్నారు. నెల్లికుదురు ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రాబోయే వార్షిక పరీక్షల నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి సిహెచ్ మదార్ గౌడ్ హాజరై మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకుండా వాటిని ఒక సవాలుగా స్వీకరించాలని, విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, మంచి మార్కులు సాధించాలని ఆయన అన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా, ప్రతిరోజూ సమయాన్ని చక్కగా విభజించుకుని చదువుకోవాలని సలహా ఇచ్చారు. చదివిన అంశాలను తరచుగా పునశ్చరణ చేసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, పరీక్షల్లో ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. పరీక్షల సన్నద్ధతలో పౌష్టికాహారం, తగినంత నిద్ర మరియు శారీరక వ్యాయామం చాలా ముఖ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి పెట్టగలరని తెలిపారు. సందేహాలుంటే వెంటనే అధ్యాపకులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, సానుకూల దృక్పథంతో పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆరిగకూటి శ్రీనివాసరెడ్డి, అధ్యాపక బృందం శ్రీనివాస్, కవిరాజ్, రఘురాం, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, సుధాకర్, బాబు, మహేందర్, యాకన్న, సతీష్, సుభాష్, అధ్యాపకేతర బృందం ప్రదీప్, గౌరీ శంకర్, లక్ష్మణ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: ఏడుపాయల వన దుర్గ మాత ఆలయ ప్రధాన అర్చకులు రావికోటి శంకర శర్మ కూతురు వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పర్వగౌడ్, నాయకులు బొజ్జ పవన్ తదితరులున్నారు. ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జెడ్పి మాజీ వైస్ చైర్పర్సన్ లావణ్య రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ అధ్యక్షులు బాలాగౌడ్, పాపన్నపేట ఎంపీపీ మాజీ అధ్యక్షురాలు చందన ప్రసాద్ రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

టీఎన్జీవోస్ యూనియన్ భవనాల శంకుస్థాపన

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ములుగు జిల్లాలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, టీఎన్జీవోస్ యూనియన్ భవనాల శంకుస్థాపన దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత టీఎన్జీవోస్ యూనియన్ అసోసియేషన్ మలుగు జిల్లా అధ్యక్షులు ఎం సంపత్ రావు వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉద్యోగుల యొక్క సంక్షేమం కోసం మా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం మరి కొన్ని కార్యక్రమాలు చేపట్టి వారికి ఏజెన్సీ ప్రాంతాలలో కూడా ఏలాంటి ఇబ్బంది లేకుండా ఉద్యోగం చేసుకునే విధంగా సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీజీవో టీఎన్జీవో భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయుటకు వసతులు సమకూరుస్తామనీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి వేస్తామని తెలియజేశారు. టీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమ భవన నిర్మాణానికి, గృహ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి సీతక్కని కోరడం జరిగింది. భవన నిర్మాణాలకు అనుమతించిన జిల్లా కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ ఏ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జగన్మోహన్రావు, టీఎన్జీవో ములుగు జిల్లా అధ్యక్షులు పోలురాజు సెక్రెటరీ చైతన్య డిజిఓ యూనియన్ సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, సంఘ నాయకులు దీప, కోల రాజేష్ గౌడ్ ఆసనాల శ్రీనివాస్ రాజ్ కుమార్ కిరణ్ కుమార్ శిరీష, కొమురయ్య, రఫిక్, ప్రవీణ్, రాజు, ప్రకాష్ రెడ్డి యశ్వంత్ సంఘ నాయకులు అధికారులు నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

సంపాదకీయం

దిల్లీ పేలుళ్లు-దిక్కు తోచని ప్రభుత్వం

దేశ రాజధాని దిల్లీలో సోమవారం సాయంత్రం భీకరమైన బాంబు దాడులు జరిగితే అవి తీవ్రవాద దాడులేనని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం బుధవారం తప్ప చెప్పలేక పోయింది. బాంబు పేలుళ్లకు కారకులెవరో అని ప్రభుత్వం వెంటనే చెప్పలేక పోయిందంటే దిక్కులేని స్థితిలో పడిపోయినట్టే. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించే బీజేపీ చోటా, బడా నాయకులు సైతం నోరు మెదపక పోవడం ఆశ్చర్యంగా ఉంది. అలవాటు ప్రకారమైతే ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బీజేపీ అధికార ప్రవక్తలు వీరోచితంగా పాకిస్థాన్ మీద నింద వేస్తుంటారు. కానీ దిల్లీ పేలుళ్ల సోమవారం జరిగితే బుధవారం సాయంత్రం కేంద్ర మంత్రివర్గ సమావేశం ముగిసిన తరవాతగానీ ఇది తీవ్రవాదుల పనేనని ప్రభుత్వం చెప్పలేక పోయింది. అంటే మన గూఢచార సంస్థలు, కొమ్ములు తిరిగిన రక్షణ సలహాదారు అజిత్ డోబాల్ దగ్గర కూడా ఏ సమాచారం లేదంటే ఆశ్చర్యం కలుగుతోంది. సోమవారం నాటి పేలుళ్లలో మరణించిన, క్షతగాత్రులైన వారిలో కేవలం హిందువులే లేరు. ముస్లింలు కూడా ఉన్నారు. పహల్గాం సంఘటన లాగా ఇది ఏరి కోరి హిందువుల మీద గురి పెట్టిన కిరాతక దాడికాదు. పేలుడు జరిగిన ఎర్రకోట మెట్రో స్టేషన్ దగ్గర ఎప్పుడూ జన సమ్మర్థం ఉంటుంది. ఆ జనంలో అన్ని మతాల వారూ ఉండొచ్చు. తీవ్రవాదులు ఇంతకన్నా భారీ విధ్వంసం సృష్టించాలనుకున్నారని అంటున్నారు. కానీ ఆ పని చేయలేక పోయారు. గత కొద్ది రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వేల కిలోల అమోనియం నైట్రేట్, ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాలూ స్వాధీనం చేసుకున్నారు. ఇదీ దిల్లీ పేలుళ్లకన్నా ముందే జరిగింది. ఇంత భారీ మొత్తంలో విస్ఫోటక పదార్థాలు స్వాధీనం చేసుకోకుండా ఉంటే మరెంత విధ్వంసం జరిగేదో ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఈ విధ్వంసంలో అనేక మంది పాత్ర ఉండడం చాలా ఆందోళన కలిగించే అంశం. మనుషుల ప్రాణాలు కాపాడడం, క్షత గాత్రులకు వైద్యం చేయడం డాక్టర్ల విధి. మనుషులకు సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేసిన డాక్టర్లు ఇంతటి ఘోరానికి ఎలా ఒడిగట్టగలిగారో! వైద్య రంగంలోని నైతికతను, మానవీయ విలువలను ఎలా విస్మరించగలిగారో! ఈ పేలుడుకు సంబంధించి మూడు రోజులుగా బోలెడు సమాచారం అందుతోంది. దీనిలో మేలెంతో, తాలెంతో తేల్చి చెప్పడం సాధ్యం కాదు. గోదీ మీడియా ప్రచారంలో పెట్టే బూటక సమాచారం గురించి అయితే మాట్లాడే పనే లేదు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తో సహా అనేక భద్రతా సంస్థలు ఈ దారుణంపై దర్యాప్తు చేస్తున్నాయి. అనేక సందర్భాలలో ఈ దర్యాప్తులు కొండను తవ్వి ఎలకనైనా పట్టలేదు. ఒక వేళ పట్టినా ఆ దర్యాప్తులో అనుమానితులైన వారు చివరకు నిర్దోషులని తేల్చారు. ఫరీదాబాద్‌లో భారీ మొత్తంలో ఆర్‌డీఎక్స్. పట్టుబడిందన్న వార్త నలు దిశలా వ్యాపించింది. ఆర్‌డీఎక్స్ పుల్వామాలో వినియోగించారు. అప్పుడైనా అంత పెద్ద మొత్తంలో ఆర్‌డీఎక్స్ తీవ్రవాదులనుకుంటున్న వారి చేతుల్లోకి ఎలా వచ్చిందో ఇంతవరకు తేలనే లేదు. అసలు పుల్వామా సంఘటనకు అసలు కారణం ఇప్పటికీ బయటపడనే లేదు. పుల్వామా సంఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణం అని నెత్తీ నోరు కొట్టుకుని చెప్పిన కశ్మీర్ మాజీ గవర్నర్ అసలు సత్యం బయటపడక ముందే తుది శ్వాస విడిచారు. ఈ దృష్టితో చూస్తే ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసుకున్నది అమోనియం నైట్రేట్. దీన్ని బాంబుల తయారీకి వినియోగిస్తారు. అమోనియంనైట్రేట్‌ను ఎరువుగా కూడా వాడతారు. ఒక బస్సులో కూడా అమోనియం నైట్రేట్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఇద్దరు హిందువులు కూడా ఉన్నారన్నారు. కానీ తరవాత ఏ సమాచారమూ లేదు.

చేసిన తప్పులు దిద్దుకోవాలంటే ముందు తప్పు చేసినట్టు అంగీకరించాలి. కానీ మతోన్మాదం తలకెక్కిన వారు ఆ పని ఎప్పుడూ చేయరు. యతి నర్సింగానంద, దిహీరేంద్ర శాస్త్రి లాంటి వారు ఎప్పుడూ విద్వేషం పెంచడానికే ప్రయత్నిస్తారు. ఇలాంటివారు ఏదో ఒక మతానికి పరిమితమై ఉండరు. గురువారం ఉదయమే దిల్లీలోని మహిపాల్‌పూర్‌లో మరో పేలుడు జరిగిందన్న వార్త వచ్చింది. ఇందులోని నిజానిజాలు తేలాల్సి ఉంది. కానీ మహిపాల్‌పూర్‌లో పేలింది బాంబు కాదు. ఒక బస్సు టైర్ పేలిందట. కానీ సోమవారం నాటి పేలుళ్లతో విచలితమైన దిల్లీ వాసులు బాంబు పేలింది అంటే మరెంత భయ పడతారో చెప్పాల్సిన పనే లేదు. ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా తప్పుడు సమాచారం వ్యాపింప చేయడంలో గోదీ మీడియా నిమగ్నమై ఉంది. దిల్లీ పేలుళ్ల సందర్భంగా అల్ ఫలా విశ్వవిద్యాలయం పేరు ప్రస్తావనకు వస్తోంది. ఆ సంస్థకు అక్రమంగా నిధులు అందుతాయంటున్నారు. ఆ విశ్వ విద్యాలయం మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్య తీసుకుంటుందట. అక్రమ నిధులు సమకూరడం ఒక్క రోజు వ్యవహారం కాదు. అలాంటప్పుడు ఇంత కాలం నుంచి అల్ ఫలా మీద ఈడీ ఎందుకు చర్య తీసుకోలేదు. నిజంగా ఆ విశ్వ విద్యాలయానికి అక్రమ నిధులు అందుతూ ఉంటే, వాటిని తీవ్ర వాద కార్యకలాపాలకోసం ఉపయోగిస్తూ ఉంటే నిఘా వ్యవస్థలు, ఈడీ ఏం చేస్తున్నట్టో! భీకరమైన సంఘటన ఏదో జరిగితే తప్ప ఈడీ దృష్టి అల్ ఫలా లాంటి వాటి మీద ఎందుకని పడదు. అల్ ఫలా వ్యవస్థాపకుడు మొత్తం ఏడు సంస్థలను నిర్వహిస్తారట. అలాంటప్పుడు ఆయనకు ఇంత భారీ మొత్తంలో నిధులు ఎక్కడ నుంచి సమకూర్తున్నాయన్న అనుమానం ఈడీకి వచ్చి ఉండాలిగదా. భద్రతా దళాల, నిఘా సంస్థల మౌలిక బాధ్యత ఘోరాలు, దారుణాలు నివారించడం. కానీ ఘోరమైన సంఘటనలు జరిగేదాకా వాటి మీద వివిధ సంస్థల నిఘా పడక పోవాడాన్ని ఏమనాలి. సరిహద్దు భద్రతా దళాలు, అంతర్గత వ్యవహారాలు హోం మంత్రి చేతిలోనే ఉంటాయి, భీకర సంఘటనలను హోం మంత్రిత్వ శాఖ నిరోధించక పోవడానికి మరో కారణం ఉందనుకోవాలేమో! ఆపరేషన్ సిందూర్ ముగియ లేదు కొనసాగుతూనే ఉంది బీరాలు పలికే ప్రభుత్వం పదే పదే జరుగుతున్న విధ్వంసాన్ని నిరోధించనందుకు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం లేదనుకోలేం. కానీ ఇంత వరకు ఒక్క సందర్భంలో కూడా అమిత్ షా బాధ్యతే తీసుకోలేదు. పాకిస్థాన్ మీదో మరో దాని మీదో నింద వేయడమే ఆయన పని. దిల్లీ పేలుళ్లలో టర్కీ పాత్ర ఉందని కూడా అంటున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో టర్కీ, అజర్‌బైజాన్ మనకు ప్రతికూలంగా వ్యవహరించిన మాట నిజమే. ఇప్పుడు మాత్రం టర్కీ తమ పాత్ర ఏమీ లేదంటోంది మరి. అసలు విషయాలు బయట పెట్టకుండా, వరస దాడులు జరుగుతూ ఉంటే ప్రభుత్వం తన బాధ్యత నుంచి ఎలా తప్పించుకుంటుంది? దిల్లీ పేలుళ్ల నిగ్గు తేలాలిసిందే. తప్పుడు సమాచారంతో వాస్తవాన్ని కప్పి పుచ్చకూడదు. జరుగుతున్న పరిణామాలు ఈ భావనకు విరుద్ధంగా ఉన్నాయి.

అన్నీ మామూలే

ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ భూమి భారతిని అన్నాడొక కవి. ప్రస్తుతం వందేమాతరం ఒక సంవత్సరం పాటు పాడమంటున్నారు మన నేతలు. కడుపులోని పేగుల ఆకలి కూతలే వాయిద్యాలుగా భావించి వందేమాతరం పాడాలి. ఏమని పాడను ఈవేళ అని ఆలోచించకు నేతల పిలుపు మేరకు వందేమాతరం పాడవలసిందే. వందల సంవత్సరాల నుంచి పాడుతూనే ఉన్నాం. కాని అన్ని మామూలే. మార్పు ఏమీ లేదు. పాడమని నన్నడగవలెనా అన్నాడొక సినీకవి. షరా మామూలే అడగకుండానే పాడతాం అంటున్నారు భారత పౌరులు. నిజమే బావ అన్నీ మామూలే టోల్‌గేటు కడుతున్నాం కాని నిత్యం రోడ్డు ప్రమాదాలే. అలాగే పాలించే నేతలు దేవాలయాలకు వెళ్లి పూజలు చేయడం మామూలే. తాము బతికేది పేదల కోసమనే ఉపన్యాసాలు మామూలే. తక్కువ తూచి మోసం చేయడం వ్యాపారికి మామూలే. ప్రజల అవసరాలు రెండు నెలల్లో తీర్చుతామని నేతలు బొంకటం మామూలే. ఉద్యోగులు జీతాని కంటె ఎక్కువ బల్లకింద చేతులు పెట్టి సంపాదించడం మామూలే. మరిచాను ఇది గతం. ప్రస్తుతం బల్లపైనే నలుగురి ఎదుటే వసూలు చేయడం కామన్. ఆనాడు ఇందిరాగాంధీ గరీబ్ హటావో అన్నా, మన్మోహన్‌సింగ్ కనీసం ఏడాదికి వంద పని దినాలు కల్పించినా అన్నీ మామూలే. విద్య, వైద్యం ఆహారం వంటి విషయాలలో స్థిరమైన వృద్ధి ఉండాలని అంతర్జాతీయ ప్రణాళికలున్నా ఆచరణలో అన్నీ మామూలే. పేదరిక నిర్మూలనకు కేటాయించిన నిధులు నేతల జేబుల్లోకి పోవడం మామూలే. కాయలు, ఆకులు తిని జీవించే ఆదివాసీలకు గౌరవప్రదంగా జీవించే ఏర్పాట్లు చేస్తున్నామని నేతల మాటలు మామూలే. అందుకే వారు నక్సలైట్లకు ఆశ్రయం కల్పించారనేది మాత్రం నగ్న సత్యం.

నిజమేనయ్యా బావ ఈమధ్య మన దేశ ముఖ్యమంత్రుల ఆస్తుల వివరాలు పేపర్లలో చదివి ఆశ్చర్యపోయాను. ఒకనాడు కమ్యూనిస్టు నాయకులు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య,

మాకినేని బసవపున్నయ్య, మానికొండ సుబ్బారావు లాంటి అనేక మంది తమ సొంత ఆస్తి పేదల కోసం పోరాడే పార్టీకి ఇచ్చేశారు. కాని ఈనాటి నాయకులు ప్రజలకు సేవ చేస్తామంటూ ప్రజల సొమ్ము దిగమింగి ఇతర రాష్ట్రాలు చాలక ఇతర దేశాల్లో దాచుకుంటున్నారంటే అది కూడా మామూలుగానే మారింది. ఎన్టీరామారావు కిలో బియ్యం రెండు రూపాయలకు అలాగే నిత్యావసరాలు సబ్సిడీపై అందించారు. ఆయన దిగిపోయిన తరువాత అవి కొనసాగినా వాటిలో మామూళ్లు దండుకోవడం షరా మామూలై పోయింది. సంపాదించిన సొమ్ముతో నేతలు ఓట్లుకొని గద్దెనెక్కడం, ఓట్లు అమ్ముకోవడం పేదలకు మామూలై పోయింది. కాని పేదలు తీసుకోవడం కంటే ఓట్లు కొనే నేతలదే తప్పుగా పరిగణించాలి. ఎందుకంటే వారడగకుండానే ఓటుకు నోటు ఇచ్చిన నేతలదే తప్పుగా భావించాలి. అధికారంలో ఉండి సంపాదించడం నేరంగా పరిగణించాలి. ఓటర్లు అడగకుండానే ఎన్నికల సమయంలో నేతలే వాగ్దానాల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల సమయం చాలా దూరం ఉన్నా స్త్రీలకు ఉచిత బస్సు చంద్రబాబు కల్పించారు. దాంతో అవసరం లేకున్నా స్త్రీలు కొందరు ప్రయాణం చేస్తున్నారు. పురుషులు బస్సు ఎక్కడం గగనంగా మారి నిరుపేద అయినా ఎక్స్‌ప్రెస్ లేక నాన్‌స్టాపో ఎక్కి ఎక్కువ చార్జీ చెల్లించడం తప్పనిసరైంది.

అంతెందుకు శాసనసభకు వెళ్లాలంటే పెద్ద పార్టీల అధి నాయకునికి వందల కోట్లు ఇచ్చి టికెట్టు పొందడం మామూలైంది. ఇటీవల ఒక శాసనసభ్యుని ఉదంతమే అందుకు ఉదాహరణ. అధికారులకు, అనధికారులకు వారు వీరు అనేదేముంది ప్రతిచోట మామూళ్లు మామూలైపోయింది. సమాజ సేవ చేసేవారికి టికెట్లు దక్కవు. తెలివిగల విద్యార్థికి ఉద్యోగం రాదు. ఈ రకంగా ప్రతిదానికి ముడుపులు చెల్లించడం మామూలైపోయింది. భగవంతుడు సర్వాంతర్యామి అంటారు. కాని ఆయన్ని కొలవని నాస్తికులనే వారున్నారు గాని మామూళ్లు అనేది మాత్రం సర్వాంతర్యామిగా మారిపోయింది. ఈ పరిస్థితిని మార్చాలని పోరాటం చేసే వారికి లాఠీదెబ్బలు, జైలు పాలవడం మామూలైపోయింది. అటువంటి వారికి కూడా ఎరవేసి బయటకొచ్చి లొంగిపోయేలా చేయగల నేతలు ప్రస్తుతం కనబడుతున్నారు. భార్యాబిడ్డలు గుర్తుకొచ్చో లేక వారు కూడ కరెన్సీ కోసం మెత్తబడటమే ముందు ముందు మామూలైపోవచ్చు. ఆనాడు కమ్యూనిస్టు అగ్ర నాయకుల మాటలు పెడ చెవిన పెట్టి అడవి బాట పట్టి ప్రాణాలర్పించడం మామూలైపోయింది. ఇప్పటికైనా విద్యాధికులు ముఖ్యంగా విద్యార్థులు, యువకులు ఆలోచించి నిత్యం పేదల కోసం సమ సమాజం కోసం పోరాడే పార్టీలతో వ్యవస్థలతో చేతులు కలపడం మంచిది. ఈ రకంగా సమాజంలో మామూళ్లు మామూలై ప్రజల ప్రాణాలను బలిగొనే ప్రతిది మామూలై పోవడం మేధావులు, విద్యావంతులు జీర్ణించుకోలేకపోతున్న నేతలకు మాత్రం వారి ఆవేదన వినడం చూడటం మామూలైపోయింది.

సెల్: 9885569394

వైద్య విద్యా శాఖ అసంబద్ధ నిర్ణయాలు

టి. లక్ష్మీనారాయణ

మెడికల్ మైక్రోబయాలజీ (వైద్య సూక్ష్మజీవశాస్త్రం) అభ్యసించకుండా ప్లాంట్ మైక్రోబయాలజీ (మొక్కల సూక్ష్మజీవశాస్త్రం)లో పీహెచ్‌డీ చేసిన వారు వైద్య సూక్ష్మజీవశాస్త్రం బోధించవచ్చుట! ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా శాఖ లీలలు వర్ణనాతీతం. దేశంలో వైద్య విద్యా ప్రమాణాలను పరిరక్షించే బాధ్యత నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)పై ఉన్నది. ఎంబీబీఎస్, ఎండి పట్టభద్రులైన డాక్టర్లు కాకపోయినా, వైద్య సూక్ష్మజీవ శాస్త్రంలో రెండేళ్లు ఎంఎస్సీ చదివి, పీహెచ్‌డీ చేసి "డాక్టరేట్" పుచ్చుకున్న వారిని కూడా వైద్య కళాశాలల్లో అధ్యాపకులుగా నియమించడానికి అర్హులుగా ప్రకటించింది. "మీకంటే మించిన ఘనుడు ఆచంట మల్లన్న" అన్న సామెతగా ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యాశాఖ వ్యవహరించింది. ఏ సబ్జెక్ట్‌లో "డాక్టరేట్" పుచ్చుకున్నారో కూడా కనీసం విజ్ఞతతో పరిశీలించకుండానే ఒకరిని ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. వైద్య కళాశాలలో జాయినింగ్ రిపోర్ట్ సందర్భంలో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ అభ్యంతరం చెప్పడంతో ఆ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం సమస్య పూర్వాపరాల్లోకి వెళ్లకుండానే వైద్య విద్యాశాఖ ఆ వ్యక్తిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించింది, కాబట్టి, ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ సేవలను వినియోగించుకోవాల్సిందేనంటూ తీర్పు ఇచ్చిందట! దాంతో వైద్య కళాశాలల్లో ఆ సబ్జెక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు ముక్కున వేలేసుకున్నారు. దీనిపై ప్రభుత్వ వైద్య అధ్యాపకుల సంఘాలు కూడా స్పందించలేదు.

రాష్ట్రంలో పది వైద్య కళాశాలలను పీపీపీ నమూనా కింద ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వైద్య విద్యా ప్రమాణాలు దారుణంగా పతనం కావడానికి దారితీస్తున్న అంశాలపై ఆందోళన వ్యక్తమౌతోంది. సూక్ష్మజీవశాస్త్రం అనేది జీవ శాస్త్రాల ఒక ప్రాథమిక విభాగం. ఇది కంటికి కనపడని సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, ప్రోటోజోవా (సూక్ష్మపరాన్నజీవులు), ఆల్గే(నీటి నాచు) లను అన్వేషిస్తుంది. సూక్ష్మ జీవులు మానవుల ఆరోగ్యం,

మనుగడను నిర్ణయించడంలో, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడంలో, వ్యవసాయాన్ని నిలబెట్టడంలో, వాతావరణాన్ని ప్రభావితం చేయడంలో అపారమైన పాత్ర పోషిస్తాయి. సూక్ష్మజీవశాస్త్రం అనేక శాఖలుగా అభివృద్ధి చెందింది. ప్రతి ఒక్క శాఖ సూక్ష్మజీవుల జీవితంలోని విభిన్న కోణాలు - లక్షణాలు నిర్దిష్ట వాతావరణాల్లో, అతిథేయులతో వాటి పరస్పర చర్యలపై దృష్టి పెడుతుంది.

సూక్ష్మ జీవులు అంటే అందరికీ వ్యాధిని కలిగించేవిగానే చాలామంది భావిస్తారు. అయితే వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలను తయారుచేయడానికి, అలాగే మానవ శరీరంలో కొన్ని విటమిన్లు మొదలైనవి తయారు కావడానికీ, మన ప్రేగుల ద్వారా శరీర ఆరోగ్యాన్ని నియంత్రించే "గట్ మైక్రో బయోమ్" అనే సూక్ష్మజీవుల సమూహంగాను, అలాగే వివిధ మందుల తయారీలోను కూడా సూక్ష్మ జీవుల పాత్ర ఎంతో వుంది. కేవలం మనుషులలోనే కాకుండా మొక్కలలో కూడా అనేక వ్యాధులను కలిగించే సూక్ష్మ జీవులు, మొక్కలు సరిగా పెరగడానికి తోడ్పడే సూక్ష్మజీవులు కూడా ఉంటాయి. మట్టిలో వుండే కొన్ని రకాల సూక్ష్మజీవులు ప్రకృతిలోని నత్రజనిని మొక్కలకు అందించడంలో సహాయపడతాయని ఎన్నో దశాబ్దాల క్రితమే శాస్త్రవేత్తలు గుర్తించారు. ద్రాక్షరసం పులిసి దాని నుంచి "వైన్" తయారీ కావడానికి సూక్ష్మజీవుల పాత్ర కూడా అందరికీ తెలిసిందే.

మనుషులకు సంబంధించిన, మొక్కలకు సంబంధించిన సూక్ష్మజీవులలో, వాటి వ్యాధి కారక విధానాలలో అనేక భేదాలు ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకొనే మానవులకు సంబంధించిన సూక్ష్మజీవశాస్త్రం (మెడికల్ మైక్రోబయాలజీ) గా, జంతువులకు సంబంధించిన సూక్ష్మజీవశాస్త్రం (వెటర్నరీ మైక్రోబయాలజీ) గా, మొక్కలకు సంబంధించిన సూక్ష్మజీవశాస్త్రం (ప్లాంట్స్ మైక్రోబయాలజీ) గా ఎన్నో దశాబ్దాలుగా ప్రత్యేక శాఖలుగా గుర్తింపు పొందాయి. దీనికి కారణం, మనుషుల జీవ కణాలకు, మొక్కల జీవ కణాలకు మధ్య ఉన్న వ్యత్యాసం, అవి వ్యాధి కలిగించే విధానాలలో వున్న తేడా మాత్రమే కాదు, చికిత్సా విధానాలు కూడా. ప్రతి విభాగం ప్రత్యేకత (స్పెషలైజేషన్)కు నిర్దిష్ట లక్ష్యం, శిక్షణ, నిర్దిష్ట పద్ధతులు వాటి పరిధిలో సందర్భోచిత అవగాహన అవసరం అందరూ గుర్తెరగాలి. అలాగే వాటి పరిశోధనా పద్ధతులు, ప్రయోగశాల పద్ధతులు, లక్ష్యాలు కూడా గుణాత్మకంగా, గణనీయంగా భిన్నంగా ఉంటాయి. మొక్కల వ్యవస్థలలో శిక్షణ పొందిన పరిశోధకులు మానవ వైద్య విద్యకు అవసరమైన మానవ శరీర ధర్మశాస్త్రం, మానవ వ్యాధి నిర్ధారణ శాస్త్రం క్లినికల్ నైపుణ్యాన్ని కలిగి ఉండరు. దానికి వైద్య శాస్త్రంలో అవగాహన ఉండడం ఎంతో అవసరం.

అర్హత, విద్యాపరమైన పరిగణనలు: వైద్య విద్యా కళాశాలలకు ఎన్ఎంసి. మార్గనిర్దేశం చేస్తుంది. వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, ఎండి విద్యార్థులకు మెడికల్ మైక్రోబయాలజీని బోధించడానికి, మెడికల్ మైక్రోబయాలజీలో ఎండీ లేదా ప్రత్యేకంగా మెడికల్ మైక్రోబయాలజీ ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేసిన పట్టభద్రులు అర్హులు. మరే ఇతర మైక్రోబయాలజీ సబ్జెక్ట్‌ను అధ్యయనం చేసిన వారికి మానవ శరీరానికి సంబంధించిన మెడికల్ మైక్రోబయాలజీ పట్ల అవగాహనే ఉండదు. ఈ నేపథ్యంలో ప్లాంట్ మైక్రోబయాలజీ స్పెషలైజేషన్ ఉన్న వ్యక్తులను మెడికల్ మైక్రోబయాలజీని బోధించడానికి నియమించడం అశాస్త్రీయం, వైద్య విద్యా ప్రమాణాలను కాలరాయడమే. చేసిన తప్పును ఇప్పటికైనా గుర్తించి, ప్లాంట్ మైక్రోబయాలజీ స్పెషలైజేషన్ డాక్టోరల్ డిగ్రీతో వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులైన వారి సేవలను వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలు లేదా వాటి అనుబంధ కళాశాలల్లో ఉపయోగించుకోవడం ద్వారా సరిదిద్దుకోవాలి.

పర్యవసానాలు: ఇటువంటి నియామకాలు చెల్లుబాటు అయితే వైద్య విద్యా ప్రమాణాలు పతనం కావడమే కాదు, వృత్తిపరమైన ఆగాధం - తీవ్ర పర్యవసానాలకు దారితీస్తాయి. క్లినికల్ మైక్రోబయాలజీలో వ్యాధికారక జీవులను నిర్వహించడం, రోగ నిరోధక విధానాలను అర్థం చేసుకోవడం, రోగికి సంబంధించిన డేటాను విశ్లేషించి వివరించడంలో శాస్త్రీయ సందర్భం భిన్నంగా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, రోగ నిర్ధారణ, ఎపిడెమియాలజీలో వైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి వైద్య సూక్ష్మజీవ శాస్త్రంలో లోతైన పరిజ్ఞానం, బోధనా నైపుణ్యం అధ్యాపకులకు విధిగా ఉండాలి. లేకపోతే, వైద్య విద్య నాణ్యత, విశ్వసనీయత బుగ్గిపాలవుతుంది. స్థూలంగా సూక్ష్మజీవ శాస్త్రం ఒక సమగ్రమైన శాస్త్రం. అత్యంత వైవిధ్యభరితమైన శాస్త్రం కూడా. సూక్ష్మజీవ శాస్త్రంలోని అన్ని శాఖలు ఒక సాధారణ పునాదిని పంచుకున్నప్పటికీ, విద్య, వృత్తిపరమైన సామర్థ్యాన్ని నిర్ణయించడానికి ఆయా శాఖల్లో "స్పెషలైజేషన్" ఉండి తీరాలి. ప్లాంట్ మైక్రోబయాలజీలో డాక్టరేట్‌తో మొక్కల సంబంధిత సూక్ష్మజీవుల వ్యవస్థలో నైపుణ్యాన్ని పొందవచ్చు. కానీ, వైద్య సూక్ష్మజీవ శాస్త్రాన్ని బోధించడానికి అర్హతను సాధించిపెట్టదు. ఇది మానవ ఆరోగ్య ఆధారిత విభాగం. అందువల్ల, వైద్య విద్యా సంస్థలు, నియంత్రణ సంస్థలు నియామకాలు చేసేటప్పుడు ఈ శాస్త్రీయ వ్యత్యాసాలను గుర్తించకపోతే వినాశనమే.

సామాజిక అధ్యయనకారుడు

మామిడి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపరా!

టి.జనార్దన్

మామిడి పంట రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పండించడం దేశ, విదేశాలకు మన మామిడి రుచులను చూపించడం మనకెంతో గర్వకారణం. దీనికి మామిడి రైతుల శ్రమ, పట్టుదల, కృషే ప్రధాన కారణం. మామిడి పంటను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ యార్డులు, ర్యాంపులు తొలుత ప్రారంభం కాగా పల్ప్‌కు కూడా ఉన్న డిమాండ్ రీత్యా వ్యాపార లాభార్జన కోసం గుజ్జు కర్మాగారాలు సైతం వెలిశాయి. శ్రమకు తగ్గ పంట చేతికి అందేందుకు రైతు సస్యరక్షణ చర్యలను చేపడుతూ అధిక దిగుబడుల కోసం ఎంతగానో కృషి చేయాల్సి వుంది. అయితే పంట నూర్పిడి సమయానికి శ్రమతో ఏమాత్రం పాత్రలేని దళారీలు, కొందరు వ్యాపారులు, పైపెచ్చు అత్యాశపరులైన గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు కీలకపాత్ర పోషిస్తుంటారు. రైతు పెట్టుబడి కూడా దక్కకుండా చేసేందుకు వివిధ పద్ధతుల్లో కృత్రిమంగా మార్కెట్ మాయాజాలం బూచి చూపిస్తూ రైతును నట్టేట ముంచుతున్నారు. దీనితో రైతు ప్రతి ఏటా కనీస గిట్టుబాటు ధర కోసం రోడ్డు ఎక్కే పరిస్థితి కల్పించారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. ఏదో సీజన్లో అధికారులు రైతులతో రెండు, మూడు సమావేశాలు ఏర్పాటు చేయడం, ఉత్తుత్తి ప్రకటనలు ఇవ్వడం, మరీ అవసరం అనిపిస్తే, కంటి తడుపు చర్యగా కొంత ప్రోత్సాహక నిధిని మంజూరు చేయడంతో సరిపెట్టుకుంటున్నారు. ఎంతో కాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నట్లు మామిడి బోర్డు ఏర్పాటు చేసి అందులో రైతులకూ భాగస్వామ్యం కల్పించి మెరుగైన యాజమాన్య పద్ధతులు పోషించి, చీడ, పీడల నుంచి విముక్తి కలిగించేలా, ఎగుమతులు ప్రోత్సహిస్తూ, రైతు ఆదాయం రెట్టింపు చేసేందుకు, తద్వారా రాష్ట్రానికి జీఎస్టీ, దేశానికి విదేశీ మారక ద్రవ్యం, సమకూర్చే చర్యలకు అనువుగా ప్రయత్నాలే చేయడం లేదు.

అంతు చిక్కని సిండికేట్ మాయాజాలం:

: గత ఏడు సంవత్సరాలుగా జిల్లాలో గుజ్జు ఫ్యాక్టరీ యజమానుల కబంధ హస్తాల్లో రైతులు నలిగిపోతున్నారు. ఈ సంవత్సరం మరింత భిన్నంగా వీరికి అనుబంధంగా ర్యాంపు నిర్వాహకులు తోడై రైతులను నిలువు దోపిడీ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం వీరి ఆగడాలను నిలువరింప చేసేందుకు కొంత ప్రయత్నం చేసినా సఫలం కాలేకపోయారు. వీరికి రాజకీయ అండ, మెండుగానే ఉందనేది బహిరంగ రహస్యం. గుజ్జు యజమానులు సహాయ నిరాకరణ నేపథ్యంలో, కనీస మద్దతు ధర రూ.12 కూడా, చెల్లించేందుకు ససేమిరా అనడంతో కిలోకి రూ. 4చొప్పున ప్రోత్సాహకం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. సత్వరం ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ జూన్ ఏడో తేదీన (8+4) రూ. 12, (8 ఫ్యాక్టరీ, 4 ప్రోత్సాహకం) చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అప్పటికే అనేక దఫాలుగా జిల్లా కలెక్టర్ గుజ్జు యజమానులు, రైతు సంఘ నేతలతో సమావేశం నిర్వహించినా గిట్టుబాటు ధర విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ నేపథ్యంలో అనివార్యంగా ప్రభుత్వం, ఉభయతారకంగా ఉంటుందని నాలుగు రూపాయలు ప్రోత్సాహకం అందించాలని ముందుకు వచ్చి రూ. 260 కోట్లు ఉద్యాన శాఖకు జమ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంతచేసినా గుజ్జు యజమానులను సంతృప్తిపరచలేదు. సీజన్లో ప్రతి యేడుకు భిన్నంగా క్రషింగ్ ఆలస్యంగా మొదలుపెట్టి తమ కుటిలత్వం చాటుకున్నారు. పర్మిట్లు జారీ చేయడంలో రైతులను తీవ్రంగా నిరాశ, నిస్పృహలకు గురి చేశారు. వీరి కనుసన్నల్లోనే ర్యాంపులను కొనసాగిస్తూ, రాజకీయ అండలేని, పర్మిట్‌లు సకాలంలో పొందలేని రైతులు అనివార్యంగా, అయిన కాడికి (2, 3 రూ.) వారినే ఆశ్రయించాల్సి వచ్చింది. కలెక్టర్ ఇచ్చినటువంటి ఉత్తర్వులో ర్యాంపు నిర్వాహకులు కూడా రూ.8 చెల్లించాల్సిందే నంటూ ఫ్లెక్సీలు పొందుపరచినా వారి దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇక్కడ రూ 8 ధర అనేది, ముఖ్యం కాకుండా తమ కాయలు పాడైపోకుండా ఫ్యాక్టరీనో, ర్యాంపో, యార్డో తమకు అప్రధానమని భావించిన రైతుల, మానసిక స్థితి, ఆందోళనను

వీరు చాలా బాగా పసిగట్టారు. అందుకే వీరి దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ అధికారులు కూడా నిశ్చేష్టులుగా మారారు.

ఈ నేపథ్యంలో ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని జులై 22న చిత్తూరులో మామిడి రైతులు సభను ఏర్పాటు చేసి దానికి ఇద్దరు శాసనసభ్యులను ఆహ్వానించి వారి నుంచి గట్టి హామీని సైతం పొందారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉల్లంఘించే గుజ్జు ఫ్యాక్టరీ యజమానుల లైసెన్సులు రద్దు చేయిస్తామని పల్లును సైతం అమ్మనీయకుండా కట్టడి చేసి అమలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఆ సందర్భంగా మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం సైతం మామిడికి కనీస మద్దతు ధర రూ.14. 90 నిర్ణయించినట్లు ప్రకటించి 25 శాతం సబ్సిడీ కూడా భరిస్తామన్న ప్రకటన కొంత వరకు ఊరట నిచ్చింది.

తదుపరి వ్యవసాయ శాఖ మంత్రితో ముఖాముఖి సమావేశాన్ని గుజ్జు యజమానులు బహిష్కరించినా, సీఎం కుప్పం పర్యటన సందర్భంగా తల ఊపినా తిరిగి తమ నైజాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేశారు. ఇంతటితో ఆగక ఒక ఫ్యాక్టరీ నిర్వాహకుడైతే తమ ఆవరణలో ప్రభుత్వ అధికారులే ఉండరాదంటూ హుకుం జారీ చేయడం, జిల్లా కలెక్టర్‌కి లీగల్ నోటీసు ఇచ్చే స్థాయికి ఎదిగారు. ప్రభుత్వం తరఫున ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన బ్యానర్లను కొందరు తొలగించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని కఠినంగా అమలు చేయాలని రైతులు ముఖ్యమంత్రికి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టడం, కలెక్టరేట్ వరకు స్కూటర్ ర్యాలీలు నిర్వహించడం వంటి వినూత్న కార్యక్రమాలు సైతం చేపట్టారు. అయినా స్పందన లేదు. చివరకు మామిడి రైతుల్లో 50% వరకు ప్రాతినిధ్యం ఉన్న పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెంలో అక్టోబర్ 15 న ఆక్రందన సభ పేరున మామిడి రైతులతో సమావేశాన్ని అఖిలపక్ష నేతల తోడ్పాటుతో మామిడి రైతు సంఘం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడ్ని ఆహ్వానించినా ఆయన ముఖం చాటేసి చివరకు సమావేశం జరగనీయకుండా శతవిధాల ఆయన విఫలయత్నం చేశాడు. మామిడి రైతులు అడుగడుగున ఆంక్షల నడుమ పట్టు వదలక సమావేశాన్ని జయప్రదం చేశారు. సమావేశం ముందు రోజున రూ.185 కోట్లు ప్రభుత్వం తరపున చెల్లించాల్సిన రూ.4 ప్రోత్సాహకం రైతుల ఖాతాల్లో జమయింది. చిత్తూరు జిల్లాలో 32 వేల మంది రైతులకు రూ.148 కోట్లు, తిరుపతి జిల్లాలో 6 వేల మంది రైతులకుగాను రూ.26 కోట్లు, అన్నమయ్య జిల్లాలో 2400 మంది రైతులకుగాను రూ.9 కోట్లు వంతున జమయింది. ఆక్రందన సభ ముందు రోజు ఈ మొత్తం జమ చేయడమంటే మామిడి రైతు సంఘం విజయంగానే భావించాలి. అయితే 8+4 లో ప్రభుత్వ ఉత్తర్వు మేరకు తొలుత ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.8 జమచేసి, తదుపరి రూ.4 ప్రోత్సాహకం అందజేసి వుంటే రైతులకు ఎంతో ఊరటగా వుండేది. ప్రభుత్వ నిర్ణయం వల్ల గుజ్జు యజమానులు డబ్బులు చెల్లించడంలో మరింత ఆలస్యం చేస్తున్నారు. దీంతో మామిడి రైతులు ఫ్యాక్టరీలు, ర్యాంపుల నుంచి రావాల్సిన రూ.300 కోట్లకుపైగా బకాయిల కోసం మరోసారి ఉద్యమించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. దీనికై మామిడి రైతు సంఘం నవంబర్ చివరి వారంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి, వంటావార్పు, ఫ్యాక్టరీల వద్ద నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. చిత్తూరు జిల్లాకి చెందిన వ్యక్తిగా, అన్ని విషయాలు అవగాహన వున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన డబ్బులను చెల్లింపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని రైతులు కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు

రూమ్ నంబరు 13

ఇదే ఉగ్ర కుట్రలకు కేంద్రం

8 మందితో ఆత్మహుతి దళం

న్యూఢిల్లీ: ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్, ఎర్రకోట పేలుడు ఘటనల్లో తీగ లాగే కొద్దీ భారీ ఉగ్ర కుట్ర బయటపడుతోంది. ఉగ్రవాదులు దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో దాడులకు పథకం పన్నినట్లు తెలిసింది. ఇందుకోసం 8 మంది సూసైడ్ బాంబర్లను సిద్ధం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుల్లో నిందితులు డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ డైరీల్లో భారీ ఉగ్ర కుట్ర గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల అల్-ఫలాహ్ యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందులో ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్ర కుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ గదిలో పోలీసులు సోదాలు జరిపి కొన్ని రసాయనాలు, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆ డైరీల్లో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. దీంతోపాటు నవంబరు 8 నుంచి 12 వరకు తేదీలను ప్రస్తావించినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు పథకం వేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను సిద్ధం చేసుకున్నారు. ఇందులో ఐ20 కారులోనే ఎర్రకోట వద్ద పేలుడు జరగ్గా... ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఈ పథకం అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్లు జరపాలని పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి.

ఈ ఉగ్ర కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించారు. ఇందుకోసం నిందితులు దాదాపు రూ.20 లక్షల వరకు నిధులు సేకరించి... ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇచ్చినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఈ డబ్బు వినియోగించి 20 క్వింటాళ్లకు పైగా ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూహ్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఈ పదార్థాలను వినియోగించి వారు ఐఈడీ బాంబులు తయారుచేయాలని ప్లాన్ చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, వీరి కుట్రలను పోలీసులు భగ్నం చేశారని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల జమ్మూకశ్మీర్, హర్యానా సహా పలు రాష్ట్రాల్లో జరిపిన సోదాల్లో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించిన సంగతి తెలిసిందే.

ప్రతి కశ్మీరీ ఉగ్రవాది కాదు

ఢిల్లీ పేలుళ్లపై సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రవాద దాడిపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గురువారం స్పందించారు. ఢిల్లీ పేలుళ్ల ఘటనను తీవ్రంగా ఖండించారు. అమాయక ప్రజలను ఇంత దారుణంగా చంపడాన్ని ఏ మతం సమర్థించదని పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతుంది, కానీ మనం గుర్తుంచుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లోని ప్రతి నివాసి ఉగ్రవాది కాదు లేదా ఉగ్రవాదులతో సంబంధం కలిగి ఉండడు. ఇక్కడ శాంతి, సామరస్యాన్ని నిరంతరం దెబ్బతీసింది కొంతమంది వ్యక్తులు మాత్రమే అని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రతి నివాసిని, ప్రతి కశ్మీరీ ముస్లింను ఒకే భావజాలంతో చూసి, వారిలో ప్రతి ఒక్కరినీ ఉగ్రవాదిగా భావించినప్పుడు, ప్రజలను సరైన మార్గంలో ఉంచడం కష్టమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కానీ మనం అమాయకులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. 'యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఇలాంటి పనుల్లో పాల్గొనడాన్ని మనం ఇంతకు ముందు చూడలేదా? విద్యావంతులు ఇలాంటి పనుల్లో పాల్గొనరని ఎవరు చెప్పారు? వారిని తొలగించడం నాకు ఆశ్చర్యంగా ఉంది. కానీ ఎలాంటి దర్యాప్తు జరిగింది? ఎందుకు కేసు నమోదు చేయలేదు' అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇస్తామని తెలిపారు.

అల్ ఫలాహ్ వర్సిటీపై ఈడీ కన్ను

ఫరీదాబాద్: ఢిల్లీ కారు బాబు పేలుడు కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే బాబ్రీ మసీదు కూల్చివేసిన డిసెంబర్ 6న 32 కార్లతో భారీ దాడులు చేయాలని ఉగ్ర డాక్టర్లు పథకం రచించినట్లు విచారణలో వెల్లడైంది. మరోవైపు, ఈ ఉగ్రవాదులతో సంబంధం ఉన్న హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల అల్ ఫలాహ్ యూనివర్సిటీపై భద్రతా సంస్థల దృష్టి పడింది. ఈ యూనివర్సిటీ నిధులపై దర్యాప్తు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ యూనివర్సిటీ నుంచే ఢిల్లీ పేలుళ్లకు కుట్ర పన్నారనే ఆరోపణ ఉంది. కేంద్రం తాజాగా అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఆర్థిక కార్యకలాపాలను, ఖాతాలను ఆడిట్ చేయాలని ఆదేశించింది. ఇదే కాకుండా దాని ఆర్థిక వ్యవహారాలపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం పరిశీలించాలని కోరింది. ఇప్పటికే జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఈ ఉగ్రదాడిపై విచారణ చేస్తోంది. ఈ ఉగ్రదాడికి కుట్ర చేసి అమలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు డాక్టర్లుతో ఈ యూనివర్సిటీకి సంబంధం ఉంది. దీంతో ఈ వర్సిటీపై దర్యాప్తు సంస్థలు దృష్టిసారించాయి. 70 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న అల్ ఫలా అనేది ఢిల్లీ-హర్యానా సరిహద్దు నుండి 27 కిమీ దూరంలో ఉన్న ఒక ప్రైవేట్ సంస్థ. సోమవారం ఐ20 కారులో పేలుడు పదార్థాలను పేల్చి ఆత్మాహుతికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ ఈ యూనివర్సిటీ డాక్టర్. డాక్టర్ షాహీన్ సయీద్, డాక్టర్ ఆదిల్ రాథర్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్ ఈ వర్సిటీలోనే పనిచేశారు. ప్రస్తుతం ముగ్గురు డాక్టర్లను అధికారులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ముజమ్మిల్ షకీల్ గదిలో నేరారోపణ సామగ్రిని కనుగొన్నారు.

న్యాక్ షోకాజ్ నోటీసులు

ఢిల్లీ బాంబు పేలుడు నేపథ్యంలో ఫరీదాబాద్ అల్-ఫలాహ్ యూనివర్సిటీకి ఎదురుదెబ్బ తగిలింది. తప్పుడు ప్రచారం తో మోసగించినందుకు యూనివర్సిటీకి న్యాక్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. న్యాక్ గుర్తింపు లేకుండానే వైబ్‌సైట్‌లో కళాశాలకు గుర్తింపు ఉందంటూ బహిరంగంగా ప్రదర్శించింది. దీంతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకుగాను సమాధానం ఇవ్వాలంటూ న్యాక్ నోటీసులో పేర్కొంది. తప్పుడు సమాచారంతో తల్లిదండ్రులు, విద్యార్థులను పక్కదారి పట్టించడమే అవుతుందని తన నోటీసులో న్యాక్ తెలిపింది.

మోదీ నాకు తండ్రి వంటి వారు

అన్నాడీఎంకే నేత బాలాజీ

చెన్నై: కేంద్రప్రభుత్వాన్ని నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ తనకు తండ్రి అని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి రాజేంద్ర బాలాజీ చెప్పుకొచ్చారు. విరుదునగర్ జిల్లా శివకాశి నియోజకవర్గ అన్నాడీఎంకే బూత్ ఏజెంట్ల శిక్షణ శిబిరాన్ని గురువారం ఉదయం రాజేంద్ర బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే... అది అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడేనని, ఐదు రైల్వే వంతెనలకు శంకుస్థాపన చేసి రెండింటిని ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వంతో సన్నిహితంగా ఉంటేనే రాష్ట్రాల్లో అభివృద్ధి చూడగలమని, ముఖ్యమంత్రి స్టాలిన్ అభివృద్ధిపై దృష్టిసారించడం లేదన్నారు. ప్రధాని మోదీని తండ్రిగా భావిస్తున్నామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-అన్నాడీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

నమ్మలేకపోతున్నాం

షాహీన్ కుటుంబ సభ్యుల విస్మయం

లక్నో: ఢిల్లీ పేలుళ్ల ఘటనకు కారణమైన కీలక నిందితుల్లో ఒకరైన డాక్టర్ షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని, కనీసం అలాంటి ఘటనకు సంబంధించిన ఆనవాళ్లు కూడా తమకు తెలియదని ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. ప్రస్తుతం తాము లక్నోలోని దాలిగంజ్ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో నివాసముంటున్నామని, తాముండే ప్రాంతానికి, ఢిల్లీకి సుమారు 550 కిలోమీటర్ల దూరం ఉంటుందని షాహీన్ తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ అన్నారు. 'ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో షాహీన్‌కు సంబంధముందని, జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తోందనే ఆరోపణలపై ఆమె అరెస్ట్ కావడం కలిచివేస్తోంది. ఆమె ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తుందని విని షాక్ తిన్నా. నెల క్రితం నేను ఆమెతో మాట్లాడాను. ఆమె అలహాబాద్‌లో వైద్య విద్య పూర్తి చేసి, ఫరీదాబాద్‌లో పనిచేస్తోంది' అని అన్సారీ తెలిపారు. షాహీన్ సోదరుడు మహమ్మద్ షోయబ్ మాట్లాడుతూ 'షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయంటే నమ్మలేకపోతున్నాం. ఆమె ఢిల్లీలో అరెస్టయ్యాక... పోలీసులు, భద్రతా దళ సిబ్బంది మా ఇంటికి వచ్చారు. వారు నాతో సహా మా కుటుంబంలో ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదు. నాలుగేళ్లుగా షాహీన్ మాకు దూరంగా ఉంటోంది. కానీ ఆమె పిల్లలతో మా అమ్మానాన్నలు అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవారు. లక్నోలోని ఐఐఎం రోడ్డులో షాహీన్‌కు ఓ ఇల్లుందని తెలుసు. మేమెప్పుడూ అక్కడికి వెళ్లలేదు. కనీసం అదెక్కడుందో, ఎలా ఉందో కూడా మాకు తెలీదు. మెడిసిన్ చదివేటప్పుడు ఆమె ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినట్టు అనిపించలేదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నాం' అని వివరించారు. ఢిల్లీ పేలుడు ఘటన తర్వాత కాన్పూర్‌లో ఆప్తమాలజిస్ట్‌గా పనిచేస్తున్న షాహీన్ మాజీ భర్త డా.జాఫర్ హయత్‌ను పోలీసులు విచారించారు. 'షాహీన్ అరెస్టైన విషయం నాకూ మంగళవారమే తెలిసింది. మేమిద్దరం విడివిడిగా మెడిసిన్ పూర్తిచేశాం. నేను ఆమెకు సీనియర్‌ని. 2003లో మాకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. 2012లో మేం విడాకులు తీసుకున్నాం. అయితే మా మధ్య ఎప్పుడూ గొడవలు రాలేదు. విడాకుల తర్వాత ఆమెతో నేనెప్పుడూ మాట్లాడలేదు. అసలు ఆమె పెళ్లిళ్లలో తప్ప ఎప్పుడూ బురఖా కూడా ధరించేది కాదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలతో ప్రమేయం ఉందంటే నమ్మలేకపోతున్నాను' అని హయత్ చెప్పారు. అప్పట్లో విదేశాల్లో స్థిరపడాలని షాహీన్ తరచూ అంటుండేదని ఆయన తెలిపారు. అయితే... ఆమె భారత్‌లోనే ఉన్నట్టు ఇటీవలే తెలిసిందన్నారు. షాహీన్ గురించి విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం అనేక విషయాలు వెల్లడించింది. 2013లో జీఎస్‌వీఎమ్ మెడికల్ కాలేజీ నుంచి ఆమె ఎలాంటి సమాచారం లేకుండా అదృశ్యమైందని, ఫలితంగా కాలేజీ యాజమాన్యం ఆమెను తొలగించినట్టు తెలిపింది. ఆల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో చేరాక ఆమెకు డా.ముజమ్మిల్‌తో పాటు ప్రస్తుతం అరెస్టైన మరో ఇద్దరు వైద్యులతో పరిచయం ఏర్పడిందని అధికారుల దర్యాప్తులో తేలింది.

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు అమలు

బెంగళూరు: మహిళలకు నెలసరి సమయంలో సెలవు విధానాన్ని కర్నాటక ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది పరిశ్రమలలో 18-52 సంవత్సరాల వయస్సు గల మహిళా ఉద్యోగులకు నెలకు ఒక వేతనంతో కూడిన రోజును మంజూరు చేస్తుంది. వైద్య ధృవీకరణ పత్రాలు అవసరం లేకుండా ఈ సెలవు పొందవచ్చు. కార్యాలయాన్ని ఆరోగ్యవంతంగా మార్చే విప్లవాత్మక చర్యలో భాగంగా కర్నాటక ప్రభుత్వం అన్ని ఉద్యోగ మహిళలకు నెలకు ఒక రోజు వేతనంతో కూడిన రుతుక్రమ సెలవును తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది శాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వర్తిస్తుంది. గత నెలలో కర్ణాటక మంత్రివర్గం రుతుక్రమ సెలవు విధానాన్ని ఆమోదించింది. దీనితో, అటువంటి నియమాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా కర్నాటక నిలిచింది. 18 నుండి 52 సంవత్సరాల మధ్య వయస్సు గల శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్స్ మహిళా ఉద్యోగులందరికీ వారి రుతుచక్రంలో సంవత్సరానికి 12 రోజుల వేతనంతో కూడిన సెలవును అంటే... నెలకు ఒక రోజు అందించాలని సంబంధిత యజమానులను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జేడీయూ అత్యుత్సాహం

నితీశ్ ఇంటి ముందు 'టైగర్' పోస్టర్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తమకు అనుకూలంగా రావడంతో జేడీయూ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఈ క్రమంలోనే ఫలితాలకు ముందే సీఎం నితీశ్‌కుమార్ ఇంటి బయట 'టైగర్ అభీ జిందా హై' అంటూ రాసిన ఒక పోస్టర్ వెలిసింది. తమ పార్టీ గణనీయ సంఖ్యలో సీట్లను గెలుచుకుంటుందని ,ఇది నితీశ్ తన ముఖ్యమంత్రి తన పదవిని నిలబెట్టుకునేందుకు అవకాశాలను మరింత పెంచుతుందని జేడీయూ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పట్నాలో సీఎం ఇంటి ముంగిట వెలసిన పోస్టర్‌కు సంబంధించిన వీడియోను బీహార్ మాజీ మంత్రి రంజిత్ సిన్హా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్టర్‌పై 'టైగర్ అభీ జిందా హై' (పులి ఇంకా బతికే ఉంది) అని రాసి ఉంది. అలాగే దానిలో నితీశ్‌కుమార్‌ను 'దళితులు, మహా దళితులు, వెనుకబడినవారు, అత్యంత వెనుకబడినవారు, అగ్రవర్ణాలు, మైనారిటీల రక్షకుడు' అని రాశారు. ఈ సందేశం ద్వారా నితీశ్‌ను సమాజంలోని అన్ని వర్గాల కోసం పనిచేసే సంఘటిత వ్యక్తిగా చూపించడానికి ప్రయత్నించారు. కాగా మరి కొన్ని గంటల్లోనే బీహార్ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. సంబరాలకు ముందస్తు ఏర్పాట్లు

బీహార్‌లో ఎన్డీఏ పక్షాల నాయకులు, కార్యకర్తలు ఫలితాలు రాకుండానే సంబరాల్లో మునిగి తేలుతున్నారు. విజయోత్సవాల కోసం బీజేపీ ఏకంగా 501 కేజీల లడ్డూల తయారీకి ఆర్డర్ చేసింది. 'కౌంటింగ్ రోజు మాకు హోలీ, దసరా, దీపావళి, ఈద్.. అన్ని పండగలూ ఒకేసారి వచ్చేస్తాయి' అంటూ బీజేపీ కార్యకర్త కృష్ణ కుమార్ కల్లూ తెగ సంబరపడుతున్నారు. ఈ భారీ లడ్డూల ఆర్డర్ రావడం నిజమేనని పట్నాలోని మిఠాయి కొట్టు యజమాని కూడా ధ్రువీకరించారు. ఏకంగా 501 కేజీల లడ్డూలను నవంబర్ 14 ఉదయం డెలివరీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇక జేడీ(యూ)కి చెందిన మోకామా అభ్యర్థి అనంత్ సింగ్, ఒక హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ, తన విజయాన్ని ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంత్ సింగ్‌కు ఇప్పటికే ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు ఉంది. అందుకే, ఆయన ఈసారి తన మద్దతుదారులు, ఓటర్ల కోసం నవంబర్ 14న పట్నాలో భారీ విందు ఏర్పాటు చేశారు. అంతా ఊహించినట్టే జరిగితే, ఆ రోజు అక్కడ పెద్ద మటన్ బిర్యానీ పార్టీ జరిగే అవకాశం ఉంది.

ఈవీఎంలను మార్చే యత్నం?

ససారంలో స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉద్రిక్తత

మహాగట్బంధన్ అభ్యర్థుల ఆందోళన

ససారం: బీహార్ రోహ్తాస్ జిల్లా ససారంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఉంచిన మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్ బయట మహాఘట్బంధన్ అభ్యర్థులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. స్ట్రాంగ్ రూమ్ లోపల ఉన్న సీసీటీవీ కెమెరాలు అకస్మాత్తుగా ఆగిపోయాయని...ఎటువంటి తనిఖీ లేకుండా ఒక ట్రక్కు ఆవరణలోకి ప్రవేశించిందని వారు ఆరోపిస్తున్నారు. ఈవీఎంలను మార్చడానికే ఇదంతా జరిగిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. స్ట్రాంగ్ రూమ్ సీసీటీవీ కెమెరాలు ఆగిపోయిన వెంటనే, ఒక ట్రక్కు ఆవరణలోకి రావడం చూసి, దినారాకు చెందిన ఆర్‌జేడీ అభ్యర్థి రాజేష్ యాదవ్, ససారాం నేత సత్యేంద్ర సాహ్ తమ మద్దతుదారులతో ఆందోళనకు దిగారు. ఈవీఎంలను ట్యాంపర్ చేయడానికి కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ... ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఈవీఎంలు ఉంచిన చోటుకు రాత్రిపూట ఖాళీ ట్రక్కు ఎందుకు వచ్చింది?' అని ప్రశ్నిస్తూ, స్ట్రాంగ్ రూమ్ ఎదుటే నిరసనకు దిగారు. ఓటమి భయంతోనే ఎన్డీఏ... ఈవీఎంలను మార్చేందుకు ప్రయత్నిస్తోందని, రోహ్తాస్‌లోని ఏడు స్థానాల్లోనూ మహాఘట్బంధన్ గెలవడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

ఆర్జేడీ శ్రేణులకు తేజస్వీయాదవ్ పిలుపు

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరికొన్ని గంటల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో మహాఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ పార్టీ అభ్యర్థులు, జిల్లా స్థాయి ముఖ్య నాయకులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు, లెక్కింపు ప్రక్రియకు సన్నాహాలపై లోతైన చర్చ జరిగింది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగాఉండాలని తేజస్వి పార్టీ శ్రేణులకు సూచించారు. పోలింగ్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను పునరుద్ఘాటిస్తూ... బీహార్ ప్రజలతో పాటు పార్టీ అప్రమత్తంగా ఉందని అన్నారు. ఎన్నికల్లో కూటమి విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు. 'నిన్న రాత్రి, పార్టీ అభ్యర్థులు, జిల్లా ఆఫీస్‌బేరర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓట్ల లెక్కింపు, లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలపై లోతైన చర్చ జరిగింది' అని తేజస్వీయాదవ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఏదైనా రాజ్యాంగ విరుద్ధ కార్యకలాపాలను ఎదుర్కోవ డానికి సన్నద్ధతపై మాట్లాడుతూ "ప్రజాస్వామ్యానికి జన్మస్థలమైన బీహార్‌లోని న్యాయాన్ని ప్రేమించే ప్రజలు, బీహార్‌ను , రాజ్యాంగాన్ని ప్రేమించే అన్ని సామాజిక, రాజకీయ కార్యకర్తలు ఎటువంటి అనుచిత, రాజ్యాంగ విరుద్ధమైన కార్యకలాపాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి కట్టుబడి ఉన్నారు" అని ఆయన పేర్కొన్నారు.

త్వరలో వెండిపైనా రుణాలు

10 కిలోల వరకు తాకట్టుకు రిజర్వ్ బ్యాంక్ అనుమతి

ముంబై: ఇప్పటి వరకు బంగారంపై రుణాలను అందిస్తున్న బ్యాంక్‌లు, ఇతర విత్త సంస్థలు త్వరలోనే వెండి తనఖా రుణాలను ఇవ్వనున్నాయి. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ కీలక మార్గదర్శకాలను ప్రకటించింది. 2026, ఏప్రిల్ ఒకటి నుంచి వాణిజ్య బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు వెండి ఆభరణాలు, నాణేలపై రుణాలు ఇవ్వడానికి అనుమతి మంజూరు చేసింది. ఈ కొత్త నిబంధనలు గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక మద్దతును పెంచుతాయని రిజర్వ్ బ్యాంక్ భావిస్తోంది. ఒక వ్యక్తి గరిష్టంగా 10 కిలోల వెండి ఆభరణాలు లేదా 500 గ్రాముల వెండి నాణేలను తాకట్టు పెట్టి రుణం పొందడానికి వీలుంటుంది.

వెండి విలువలో గరిష్టంగా 85 శాతం వరకు రుణంగా ఇవ్వవచ్చు. అయితే స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నిరోధించడానికి ప్రాథమిక వెండి బిస్కెట్లు, కడ్డీలపై మాత్రం రుణాలు అనుమతించడం లేదు. గతంలో కేవలం బంగారు రుణాలకు మాత్రమే పరిమితమైన బ్యాంకులు త్వరలో వెండిని కూడా తాకట్టుగా స్వీకరించడం ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను విస్తరించుకోవడానికి, కొత్త ఖాతాదారులను పెంచుకోవడంతో పాటు వాటి వ్యాపారం పెరగనుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

దుష్ట పాలనకు చరమగీతం

టీవీకే అధినేత విజయ్

చెన్నై: మాయమాటలతో కపట నాటకాలాడుతున్న దుష్టశక్తుల పాలనకు చరమగీతం పాడనున్నామని, వచ్చే యేడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాశక్తి విలువ తెలియజేస్తామని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేకంగా డీఎంకే పేరు ప్రస్తావించకుండా ఆ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపణలు చేశారు. ఇటీవల కాలంలో పాలన, అధికారం తమ చేతుల్లో ఉందని విర్రవీగుతున్న ఓ పార్టీ ఎప్పటిలాగే ప్రత్యర్థులపై అపవాదులను, పసలేని ఆరోపణలను, విమర్శలు చేయడానికి సిద్ధమైపోయిందని విజయ్ ఆరోపించారు. ఆ పార్టీ పేరు ఏమిటో తన ప్రకటన ద్వారానే అందరికీ ఈపాటికి తెలిసే ఉంటుందని డీఎంకేని పరోక్షంగా ప్రస్తావించారు. అవినీతి, అక్రమాలకు పెట్టింది పేరుగా ఉన్న ఆ పార్టీ టీవీకేపై దుమ్మెత్తి పోయడాన్నే పనిగా పెట్టుకుందని విజయ్ విమర్శించారు. 1969 నుండి ఆ పార్టీ తన ప్రత్యర్థులపై అపవాదాలు వేయడాన్ని పనిగా పెట్టుకుందని తెలిపారు. ఆ పార్టీ తమ సిద్ధాంతాలు తెలిపి ప్రచారం చేయడానికి బదులుగా ఎప్పటిలాగే తమిళ నాడు, తమిళ భాష, తమిళ జాతి, సంప్రదాయం అంటూ ఊదరగొడుతోందని విజయ్ ఆరోపించారు. తాజాగా 'మేథో ఉత్సవాలు' పేరుతో అటకెక్కిన పాత గ్రంథాలను, తాళ పత్రాల దుమ్ముధూళి తట్టి ప్రదర్శనశాలలు నిర్వహించే స్థితికి ఆ పార్టీ దిగజారిందన్నారు. పార్టీ పతాకం 75 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లోనూ టీవీకేపైనే విమర్శలు చేశారని, వీటన్నింటికీ తోడు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా జరిపిన ధర్నాలోనూ టీవీకేపైనే తీవ్ర విమర్శలు చేశారని విజయ్ గుర్తుచేశారు. ప్రజాబలంతో దూసుకు వస్తున్న టీవీకే ధాటికి రాష్ట్రంలోని అవినీతి, అక్రమాల ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని ఆయన అన్నారు.

ఎగుమతులపై కేబినెట్ నిర్ణయం భేష్: మోదీ

న్యూఢిల్లీ: ఎగుమతులకు సంబంధించి కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరుస్తాయని, స్వావలంబన కలను సాకారం చేసుకోవడానికి సహాయపడతాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. బుధవారం మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఎగుమతి ప్రోత్సాహక మిషన్, ఎగుమతిదారులకు క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ఆమోదించింది. మేడ్ ఇన్ ఇండియాను నిర్ధారించడం ప్రపంచ మార్కెట్‌లో మరింత బలంగా ప్రతిధ్వనిస్తుందని, ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరిచే, సహకరించే ఎంఎస్ఎంఈలు, మొదటిసారి ఎగుమతి చేసేవారికి సహాయపడే ఎగుమతి ప్రమోషన్ మిషన్ (ఈపీఎం)ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని మోదీ ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. గ్రాఫైట్, సీసియం, రుబిడియం, జిర్కోనియం రాయల్టీ ధరలు హేతుబద్ధీకరించే నిర్ణయం సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తుందని మోదీ తెలిపారు.

నా మనస్సాక్షితోనే నిర్ణయం

రాజీనామా డిమాండ్‌పై అజిత్ పవార్

ముంబై: తన మనస్సాక్షిని ఉపయోగించి నిర్ణయం తీసుకుంటానని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. ఆయన కుమారుడు పార్థ్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ పూణేలోని ముంధ్వా ప్రాంతంలో రూ.1800 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రూ.300 కోట్లకు దక్కించుకుంది. కోట్ల విలువైన భూమిని అజిత్ పవార్ కుమారుడి సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం వెలుగులోకి రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై మండిపడ్డాయి. దీంతో ఈ భూమి కొనుగోలు ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. రెవెన్యూ శాఖలోని సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పూణేలో ఈ సంఘటనపై స్పందిస్తూ అజిత్ పవార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో 'నా మనస్సాక్షిని ఉపయోగించి నేను నిర్ణయం తీసుకుంటా' అని అజిత్ పవార్ అన్నారు.

మాస్కులు కాపాడలేవు

ఢిల్లీలో వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. గత కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచిక 400కిపైనే నమోదవుతోంది. దీంతో రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈ నేపథ్యం లో ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్య తీవ్రతకు మాస్కులు కూడా సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ మేరకు సీనియర్ న్యాయవాదులను వర్చువల్‌గా విచారణకు హాజరుకావాలని సూచించింది. వర్చువ ల్‌గా హాజరయ్యే వెసులుబాటు ఉన్నప్పటికీ మీరు ఎందుకు భౌతికంగా కోర్టు కార్యకలాపాలకు హాజరవుతున్నారని సీనియర్ న్యాయవాదులను జస్టిస్ పీఎస్ నరసింహ ప్రశ్నించారు. 'మీకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యే సౌకర్యం ఉంది. అయినా ఎందుకు వస్తున్నారు? దాన్ని సద్వినియోగం చేసుకోండి. కాలుష్యం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది' అని అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

బొంతు శ్రీదేవికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కాప్రా: పేదల పెన్నిధి, చెర్లపల్లి డివిజన్ ప్రజల అభిమాన నాయకురాలు గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, చెర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌కి సోనియా గాంధీ నగర్ ఫేస్-1 కాలనీ వాసులు కేక్ కట్ చేసి,శాలువతో సత్కరించి నిండు నూరేళ్ళు ఆయూరారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా హృదయ పూర్వక హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భిక్షపతి, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, కాలనీ సభ్యులు మైలారం బాల్ నర్సింహా, గోపాల్, రాజు, సిద్దు, రాజారత్నం, భాను నేత, రామారావు, యాదగిరి, హరి, గిరిజ, కాంతమ్మ, నీలమ్మ, శారద, సుమతి, పద్మ, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

బ్రిగేడ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : బ్రిగేడ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు హైదరాబాద్ జిల్లా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్2025లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు కటా, కుమిటే విభాగాలలో తమ నైపుణ్యాన్ని ప్రతిభతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో కదాలి సోనికా ప్రత్యేకంగా నిలిచారు. ఆమె కటాలో స్వర్ణపతకం, కుమిటేలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సోమేశ్వరి శుక్లా విద్యార్థులను శుభాకాంక్షలు తెలియజేశారు. నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ (ఎన్బికెఏ) వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు పీ. గణేశ్ నాయక్ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందించారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీలకు పూర్తి సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రతిభపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. పోటీ ముగింపు సందర్భంగా పోటీల్లో గెలుపొంది విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించిన ఎన్బికేఏ కోచ్‌లను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా రెసోనెన్స్ 'రెసోఫెస్ట్ 2025'

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు, స్కూళ్లు సంయుక్తంగా వార్షిక సాంస్కృతిక, విద్యా మహోత్సవం 'రెసోఫెస్ట్ 2025'ను గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా ఈ వేడుక వైభవంగా సాగింది. రెండు రోజుల ఈ వేడుకలో మొదటి రోజు హైదరాబాద్, తెలంగాణలోని 35 క్యాంపస్‌లకు చెందిన ఏడు వేల మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రారంభ వేడుకకు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య, జాగిల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, రాజ్ పీ నారాయణ, బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ సీఈఓ, ఎండీ డాక్టర్ జయతీర్థ్ ఆర్ జోషి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకకు ప్రముఖ సినీ తారలు విచ్చేశారు. దర్శకులు నాగ్ అశ్విన్, నటులు శర్వానంద్, కిరణ్ అబ్బవరం, ప్రియదర్శి, యాంకర్ సుమ కనకాల, సినీ నటి ఆనంది పాల్గొన్నారు. అంతర్ క్యాంపస్ పోటీల్లో విజేతలైన విద్యార్థులను, ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 'రెసోఫెస్ట్' అనేది జిజ్ఞాస, సృజనాత్మకత, స్వభావం అనే మూడు అంశాలపై పండుగ అన్నారు. హైదరాబాద్‌లో 16 కొత్త రెసోనెన్స్ స్కూల్ క్యాంపస్‌లను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

గోప్యంగా ఉంచిన పరిశ్రమ యాజమాన్యం..

విశాలాంధ్ర- కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధి, కొత్తూరు తండా సమీపంలో గల ఓ ప్లాస్టిక్ పాలిమర్ పరిశ్రమలో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వలస కార్మికుడు మృతి చెందినట్లు విశ్వాసనీయ సమాచారం. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బీహార్ రాష్ట్రానికి చెందిన కుసుంకుమార్ (32) బుధవారం అర్ధరాత్రి ఓ యంత్రం వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుతదా ఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం గోప్యంగా ఉంచి మృతదేహాన్ని అతని సొంత రాష్ట్రం బీహార్ కి పంపించేందుకు యత్నించినట్లు ప్రజల్లో చర్చ నియాంశంగ మారింది. విషయం తెలిసిన కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు మృతదేహాన్ని తిరిగి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడి. కేసు నమోదు చేసుకొని విచారణ అనంతరం ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వివరించనున్నట్లు సీఐ నరసయ్య తెలిపారు.

సంస్కృతి స్కూల్‌లో బాలల దినోత్సవం

విశాలాంధ్ర - మొయినా బాద్ : బాలల దినోత్సవం సందర్భంగా చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామ శివారులోని సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో కమ్యూనిటీ హెల్పర్స్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీ నిర్వహించారు. వైద్యులు, ఉపాధ్యాయులు, నర్సులు, రైతులు, సైనికులు వంటి వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావం పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల డైరెక్టర్ శశిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సేవా వృత్తుల విలువను అర్థం చేసుకునే అవకాశం లభించిందన్నారు. శుక్రవారం కూడా బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రెహీన తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - దమ్మపేట : సొంతగృహాలు లేని పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు కట్టించడంతోపాటు అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఉద్ఘాటించారు. గురువారం ఆయన నియోజకవర్గం లోని అశ్వరావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గండుగులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి యువభారత్ శక్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఉన్నత విద్య ద్వారానే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రత్తగా చదువుకొని పరీక్షలు రాయాలని అప్పుడే ఉన్నత స్థానాలకు చేరవచ్చని చెప్పారు. అనంతరం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల లబ్ధిదారులకు సుమారు రూ.16.46 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికుల సమస్యలపై ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ అన్నారు. రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం సత్యనారాయణ రెడ్డి భవన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కే రవిచంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ ఎం.నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికుల సమస్యలపై ఉద్యమించాలని అన్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలని డిమాండ్ చేయారు. రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కే ఏసురత్నం మాట్లాడుతూ మున్సిపల్ సంఘం నాయకత్వంలో సాధించుకున్న సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్‌లని అమలు చేయాలని అన్నారు. మున్సిపాలిటీలలో మరణించిన కార్మికుల కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చులు 30 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలలో మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా ఇందు లో నిర్వహిస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18, 19న అన్ని మున్సిపాలిటీలలో ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. 26న సిడిఎంఏ కార్యాలయం ముందు కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలని ధర్నా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉపాధ్యక్షులు కాంతారావు, ధర్మరాజు, రంగపాణి, నకిరేకంటి కృష్ణ, మద్దిలేటి, చెన్నయ్య, నర్సింలు, కమల, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి తీసుకోవాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : 2021 నుంచి ఇప్పటి వరకు చిన్న చిన్న కారణాలతో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులు 1,300 మందిని డిస్మిస్ చేశారని వారందరికీ తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని కోరిన జాగృతి అధ్యక్షురాలు కవిత కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021 నుంచి ఇప్పటి వరకు 1,300 మంది డ్రైవర్లు, కండక్టర్లను చిన్న చిన్న కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారిలో 491 మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వారిని కూడా ఉద్యోగాల్లోకి తీసుకునే ఆలోచనలో సంస్థ లేనట్టుగా ఇప్పుడు సంస్థ ఎండీగని కలిసిన తర్వాత తెలిసిందన్నారు. వెంటనే 491 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిగతా కార్మికుల విషయంలోనూ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆర్టీసీలో హైర్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు తీసుకుంటున్నారని, వాటి డ్రైవర్లపై ఆర్టీసీకి నియంత్రణ ఉండటం లేదని పేర్కొన్నారు. హైర్, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లే నడిపించేలా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ డ్రైవర్లు శిక్షణ పొందిన వాళ్లు, ప్రైవేటు డ్రైవర్ల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని నిలదీశారు. ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, అప్పుడే భద్రమైన ప్రయాణం ప్రజలకు, ఉద్యోగ భద్రత కార్మికులకు ఉంటుందన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహం కూల్చినవారిని శిక్షించాలి

విశాలాంధ్ర-దుండిగల్: శ్రీ నల్ల పోచమ్మ తల్లి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లి కాకతీయ వెంచర్ నందు శ్రీ నల్ల పోచమ్మ తల్లి విగ్రహని కొందరు గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి విగ్రహం కూల్చడం తీవ్ర పరిణామం.ఇది కచ్చితంగా కావాలని వివిధ విదర్మీయులు చేసిన పనేనని,ఈ యొక్క చర్యలపై పోలీసులు స్పందించడం సంతోషకరమని,ఫోరెన్సిక్ అధికారులు ఆధారాలు సేకరించడం జరిగిందన్నారు.నిందితులు ఎవరైనా సరే బయటపెట్టి కఠినంగా శిక్షించాలని దుండిగల్ మున్సిపల్ బిజెపి తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు సురేందర్ రెడ్డి, ఎట్టయ్య గౌడ్,బ్రహ్మం,మైపాల్ రెడ్డి,బిజెపి నాయకులు దమ్మగారి సీతారాం రెడ్డి,ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు లక్ష్మారెడ్డి,నాసి శ్రీపాల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో చిల్డ్రన్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ :: మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో జవహర్ లాల్ బాల్ మంచ్ అధ్వర్యంలో శుక్రవారం దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిల్డ్రన్స్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జేబీఎం జిల్లా అధ్యక్షులు ఎన్.సుదర్శన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ థావర్, డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి,

మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జేబీఎం రాష్ట్ర చైర్మన్ మామిడి రిషికేష్ రెడ్డి, స్థానిక నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. చిన్నారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో పాటలు, ఉపన్యాసం, క్విజ్ పోటీలతో పాటు నృత్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 300 మంది చిన్నారులు పాల్గొంటారని, అందరికి ప్రోత్సాహకంగా బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

రేపు ప్రత్యేక లోక్ అదాలత్

విశాలాంధ్ర,కొమురం భీం: రాజీమార్గాన సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్ కాంపౌండబుల్, ఎన్ ఐ యాక్ట్, కుటుంబ కలహాలు , వాహన ప్రమాదాలు, సివిల్, బ్యాంకు రికవరీ ఇతర కేసులకు సంబంధించి రాజీమార్గాన సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.

తాగునీరు, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చాలని జలమండలి ఎండికి వినతి

విశాలాంధ్ర-మల్కాజిగిరి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్కాజిగిరి నియోజకవర్గంలో త్రాగునీరు సరఫరా లైన్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం, పాత పైపులైన్ల మార్పిడి, కొత్త కాలనీలకు త్రాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. అదనంగా, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఎమ్మెల్యే సూచనలపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎండీని కలిసిన తెలంగాణ ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి కొరెం తెలంగాణ ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ కొత్త బృంద సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి కొరెం తెలంగాణ ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ యొక్క కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఇతర సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ కూడా అశోక్ రెడ్డి కొరెంకి ధన్యవాదాలు తెలుపుతూ, హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రెండు సంస్థల నాయకులు డ్రైవర్ల సంక్షేమం, హైర్ వెహికిల్స్ సేవల మెరుగుదల, ప్రజా సేవల బలోపేతం కోసం పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోర్‌వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ విస్తరణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలో సోలార్ విద్యుత్ విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలని తెలంగాణ రెడ్ కో ఛైర్మన్ ఎ. శరత్ అన్నారు. కలెక్టరేట్లో గురువారం రాష్ట్ర పునరుత్పత్తి శక్తి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ శరత్ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన, సౌర శక్తి వినియోగంపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సౌర విద్యుత్ వినియోగ విస్తరణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, విద్యుత్ శాఖ అధికారి మహేందర్, మేనేజర్ రాజేందర్, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో రహదారి విస్తరణ: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పటాన్ చెరువు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరువు నుండి ఇంద్రేశం మీదుగా పెద్ద కంజర్ల వరకు గల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అతి త్వరలో హెచ్ఎండిఏ ద్వారా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ పరిధిలోని ఓఆర్ సర్వీస్ రోడ్డు నుండి ఇంద్రేశం మీదుగా పెండకంజర్ల వరకు 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న బీటీ ప్యాచ్ వర్క్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరువు పట్టణానికి ఇంద్రేశంతో పాటు. రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చు గూడెం, పోచారం తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన విధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా తిరిగి రహదారి వరమ్మత్తులు చేపట్టారని. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రహదారి విస్తరణ పనులు సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బీటీ ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఏ ఈ చంద్రశేఖర్, ట్రాఫిక్ సిఐ లాలు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు అంతిరెడ్డి, బండి శంకర్, దుర్గా రెడ్డి, రామచందర్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హైదరాబాద్ : మహబూబ్ నగర్ నగరంలోని పాత తోట వద్ద ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే గౌరవ ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి చేరుకుని, సంఘటన జరిగిన తీరును, ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాతతోట ప్రాంతంలో పురాతన భవనం ఒకటి తొలగించే ప్రయత్నంలో జరిగిన ప్రమాదం వలన ఒక్కసారిగా భవనం నేలమట్టం కావడంతో భవనం క్రింద పనిచేసే ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిధిలాల కింద చిక్కుకొని మరణించారని ఆయన తెలిపారు. భవన యజమాని లక్ష్మణ్ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండానే పాత భవనాన్ని తొలగించే ప్రయత్నం చేశారని ఆయన చెప్పారు. రాజు అనే గుమాస్తా చెప్పిన వివరాల ప్రకారం ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిధిలాల కింద ఉండిపోయారని తెలిసిందన్నారు. పాత భవనం ఓనర్ లక్ష్మణ్ భద్రతా చర్యలు తీసుకొని ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే మున్సిపల్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించేందుకు ప్రయత్నాలు చేశారని , దురదృష్టవశాత్తు ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మరణించడం బాధాకరం అని అన్నారు. ఓనర్ పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. మృతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. పాత భవనాలు తొలగించాలంటే ముందుగా నోటీసులు జారీ చేసి, భద్రతా చర్యలు తీసుకొని తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను ఆయన ఆదేశించారు. నగరంలోని ప్రజలు కూడా టెక్నికల్ గైడెన్స్ తీసుకుని, పాత భవనాలను తొలగించి కొత్త భవనాలను నిర్మించుకోవాలని, ఆయన ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, పోలీసు అధికారులు తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : పొట్టకూటికోసం కూలికి వెళ్లిన అమాయక కార్మికులు పని ప్రదేశంలోనే ఇల్లు కూలి మృత్యువాత పడటం అత్యంత హృదయవిదారక సంఘటన అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ అన్నారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రైతు మార్కెట్ సమీపంలోని పాత ఇల్లును కూలకొట్టేందుకు కూలీలు పనికి వెళ్లారని దురదృష్టవశాత్తు ఆ ఇల్లు కూలిలపైన కూలిపోయిందని ఆ శిథిలాల కింద ఎంతమంది కార్మికులు ఉన్నారో కూడా లెక్క తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సంఘటన స్థలానికి ఏఐటీ యూసీ ప్రతినిధి బృందం చేరుకొని సందర్శించి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్ గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని, ఎలాంటి భద్రత కల్పించకుండా కూలీల చావుకుకారమైన ఇంటి యజమానిని తక్షణమే అరెస్టు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కోటకద్ర నరసింహ గంటల శ్రీను, మన్యం, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మలావత్ పూర్ణకు కేటీఆర్ పరామర్శ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎవరెస్ట్ అధిరోహకురాలు మలావత్ పూర్ణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి గిరిపుత్రికగా పేరు తెచ్చుకున్న మలావత్ పూర్ణ తండ్రి దేవీదాస్ కన్నుమూయడంతో, కేటీఆర్ ఆమెను ఓదార్చారు. కేటీఆర్ ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల బిజీలో ఉన్నప్పటికీ, ఈ విషాద వార్త తెలుసుకుని వెంటనే నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండలం, పాకాల గ్రామంలో ఉన్న పూర్ణకు కాల్ చేశారు. పూర్ణ తండ్రి మరణం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పూర్ణకు ధైర్యం చెప్పిన కేటీఆర్, త్వరలోనే స్వయంగా వచ్చి ఆమె కుటుంబాన్ని కలవనున్నట్లు హామీ ఇచ్చారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

విశాలాంధ్ర - మొయినా బాద్ : మండల పరిధిలోని ఎత్బార్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి గురువారం చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ హాజరై నూతన గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శునకాల బెడద తీర్చాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : చేవెళ్ల అంబేద్కర్ నగర్ కాలనీలో కుక్కల బెడద ఎక్కువ కావడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నపిల్లలను బయట ఆడుకునేందుకు పంపించాలంటేనే భయపడుతున్నారు. కుక్కలు పంది పిల్లలను వెంటాడి పీకుతింటున్నాయి. 20 ఉన్న పంది పిల్లలు ప్రస్తుతం 3 మాత్రమే మిగిలాయి. 17 పంది పిల్లలను కుక్కలు పీకుతిన్నాయి. పాఠశాలలకు వెళ్లేందుకు ఆ దారిలో చిన్న పిల్లలు ఎక్కువగా వెళుంటారు. పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగకముందు అధికారులు కుక్కల బెడద తీర్చేలా చూడాలని కాలనీ వాసులు ప్రాధేయపడుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీ కళ్యాణ్ నగర్ మెయిన్ రోడ్ సుమారు రూ.60 లక్షల వ్యయంతో సిసి రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... అభివృద్ధికి మొదటి ప్రాధాన్యను ఇవ్వనున్నట్లు ఆయన తెలి పారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, ఓం రాజ్, శ్రీమన్నారాయణ, జయ కృష్ణ, కిరణ్ కుమార్, చంద్రకళ, శేషగిరి, సుదర్శన్, పెద్దిరాజు, చంద్రకాంత్, సోమయ్య, జగన్మోహన్, హరిప్రసాద్, శర్మ, కిషోర్ పాల్గొన్నారు.

నూర్‌ను సన్మానించిన ట్రస్ట్ సభ్యులు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : అజంతా, షిర్డీ సాయి నగర్ - తిరుపతి ఎక్స్ ప్రెస్ లను మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో నిలుపుదలకు కృషి చేసిన సందర్భంగా ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జెడ్ ఆర్.యు.సి.సి మెంబర్ సౌత్ సెంట్రల్ రైల్వే నూర్ ను శ్రీ సాయిబాబా టెంపుల్ ట్రస్ట్

సభ్యులు లింగా రెడ్డి, జి.హనుమంత్ రావు, శ్రీనివాస్ శర్మ, చెన్నకేశవ రావు, నర్సింగ్ సింగ్ లు గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మల్కాజిగిరి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపడం వల్ల ప్రధాన స్టేషన్‌లో రద్దీ తగ్గుతుందని, శివారు స్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్‌లు నిలపడం వల్ల ప్రయాణికులకు ఉపయోగకారిగా ఉంటుందన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర -కొత్తూరు: సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు, శుక్రవారం నందిగామ మండలం, మేకగూడ గ్రామంలో గల పిఎసిఎస్ ఆవరణలో వరి, మొక్కజొన్న దాన్యాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సీఈఓ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా సహకార సంఘం దినోత్సవం సందర్భంగా చైర్మన్ కంకంటి మంజులారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని

నిర్వహించినట్లు వివరించారు. దీంతో ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి పిఎసిఎస్ డైరెక్టర్లు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొని విజయంతం చేయాలని ఆయన కోరారు.

బాలికలలో సృజనాత్మకత
పెంపొందించాలి: కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : బాలికలలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించే వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. నిమ్బోలి అడ్డ ప్రభుత్వ బాలికల వసతి గృహం (జువెనైల్ జస్టిస్ శాఖ)లో నావార్థ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అభిరుచి మేరకు వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సృజనాత్మకతో ఉపయోగకరమైన కొత్త వస్తువులను తయారుచేసే విధంగా ప్రత్యేక తర్ఫీదు అందించాలని అన్నారు. ఇట్టి కార్యక్రమాలు చేపట్టడంతో బాలికలలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని సూచించారు. నావార్థ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ పిల్లలతో మాట్లాడుతూ విద్య ఒక విలువైన ఆయుధమని ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుతో పాటు ఎంచుకున్న అంశంలో శ్రద్ధగా కష్టపడి పనిచేయాలని ప్రోత్సహించారు. అదేవిదంగా ఇక్కడ అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కోర్సులతో పాటు ఈ 'నావార్థ' కార్యక్రమం కూడా బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ శుద్ధపెట్టాలని అన్నారు. తదుపరి భోజనశాల, వంటగదిని పరిశీలించి గదులను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలను రుచి చూసి మెనూ ప్రకారం అందించాలని అలాగే బాలికలకు అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు. అలాగే బాలికలకు ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, వసతి గృహంలో గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు మైథిలి, వయోవృద్ధుల శాఖ ఎ డి రాజేందర్, జాయింట్ డైరెక్టర్ ఎఫ్ఎం మంజుల, వైద్యురాలు డాక్టర్ జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యునాని ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మౌలాలి ప్రాంతం లోని ప్రభుత్వ యునాని వైద్యశాల - ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఎమ్మెల్యే రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, డాక్టర్ సానియా ఫాతిమా, ఫార్మాసిస్ట్ దయానంద నుండి ఆసుపత్రి కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, మున్సిపల్ శానిటేషన్ అధికారులను తక్షణ చర్యలు తీసుకుని ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటును గుర్తు చేస్తూ, ప్రతి ప్రజా వైద్యశాలలో నాణ్యమైన సేవలు అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జె.ఎ.సి వెంకన్న, ఉస్మాన్, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి: మానసిక వికలాంగత అభివృద్ధి ఆలస్యం ఉన్న పిల్లలకు సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హాస్టల్ గడ్డలో ఉన్న సహారా ప్రాథమిక పునరావాస కేంద్రం (యస్ ఆర్ హెచ్ సి) లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి సమగ్ర పునరావాస కేంద్రాలు ఏర్పాటు తో వికలాంగత పిల్లలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. పిల్లల కోసం సంస్థ చేపడుతున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ వంటి సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సహారా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమా రెడ్డి, డైరెక్టర్ శంకర్లు కేంద్రం కార్యకలాపాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ఇన్‌క్లూజివ్ స్కూల్ ప్రారంభించే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వారు వెల్లడించారు. సాధారణ విద్యార్థులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు కలిసి చదివే విధంగా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ పద్ధతిని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, తల్లిదండ్రులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర బ్యూరో,కొమరం భీమ్: గత నెల అక్టోబర్ 18వ తేదీన దహేగాం మండలంలో గెర్రే గ్రామంలో హత్యకు గురైన శ్రావణి తల్లిదండ్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్.పి. కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డి.ఎస్.పి. లతో కలిసి శ్రావణి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు, ఇంటి నిర్మాణానికి మహిళా సమాఖ్య నుండి 1 లక్ష రూపాయల రుణ చెక్కు, అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు, 3 నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించే ఉత్తర్వులను అందజేశారు. ఎస్.పి. మాట్లాడుతూ శ్రావణిని హత్య చేసిన వారికి కఠిన శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, రక్షణ పరంగా శ్రావణి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

చద్దన్నంతో ఆరోగ్యం సాధ్యం

విశాలాంధ్ర-తొర్రూరు: చద్దన్నంలో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. తొర్రర్ మున్సిపల్ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన మన చద్దన్నం భోజనశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చద్దన్నం ఇప్పుడు అమెరికా రెస్టారెంట్లలోనూ దొరుకుతుందని, కర్డ్ రైస్ అంటూ అమ్మేసే ఈ చద్దన్నంతో ఎన్నో పోషకాలు శరీరానికి అందుతున్నాయన్నారు. పాత రోజుల్లో రాత్రి కాస్త అన్నం మిగిలితే చిన్నతనంలో అమ్మ కాసింత నీరు, పెరుగు, కలిపి, చిన్న ఉల్లిపాయ జోడించి ఉంచేదని,ఉదయం దానినే టిఫిన్ కింద పెట్టేవారన్నారు. వేసవిలో ఇది కడుపులో చల్లగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య, నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, కందాడి అచ్చిరెడ్డి,మంగళపల్లి రామచంద్రయ్య,జీనుగా సురేందర్ రెడ్డి,ముద్దం మహబూబ్ రెడ్డి,ముద్దసాని సురేష్, కృపాకర్ రాజు, బసన బోయిన మహేష్, పాల శ్రీనివాస్,హెూటల్ నిర్వాహకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పంటల కొనుగోలు సమస్యలపై
కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ :: సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో ఏర్పడుతున్న సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖల ద్వార కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొంథ తుఫాను, అకాల వర్షాలు మరియు అనిశ్చిత వాతావరణం కారణంగా సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, తెలంగాణ రైతులు పంటల కొనుగోలుకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం సేకరించే సోయాబీన్, పత్తి పంటల విషయంలో కొన్ని ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్ గిరిరాజ సింగ్ ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 3,66,697 ఎకరాల్లో సోయాబీన్ సాగు జరిగినట్లు, సగటున దిగుబడి ఎకరాకు 7.62 క్వింటాళ్లుగా అంచనా వేశామన్నారు. కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని మంత్రి పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు పడటం వంటి సమస్యల వల్ల పంట ఎఫ్ ఏక్యూ నిబంధనలకు అనుగుణంగా పంట రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సోయాబీన్‌పై ఎఫ్ ఏక్యూ ప్రమాణాలను, ప్రత్యేక సందర్భంగా పరిగనించి సడలించాలని కేంద్రాన్ని కోరారు. ఆ ప్రకారం ఎన్ ఏఫెడ్, ఎన్ సీసీఎఫ్ సంస్థలు సడలించిన నాణ్యత ప్రమాణాలకనుగుణంగా సోయాబీన్ కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. మొక్కజొన్న సాగు ప్రస్తుతం 6.74 లక్షల ఎకరాల్లో జరుగుతుండగా, 25 క్వింటాళ్ల సగటు దిగుబడితో సుమారు 16.85 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామన్నారు. అయితే మార్కెట్‌లో ధర క్వింటాళ్లకు రూ.1959కు పడిపోయి, కేంద్రం ప్రకటించిన ఎంఎస్పీ ధర రూ.2400 రాకపోవడంతో రైతుల్లో ఆందోళన పెరగడంతో, రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా రంగములోకిదిగి మొక్కజొన్న కొనుగోలు ఆరంభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 ఎంటీలను కొనుగోలు చేసి 14,519 మంది రైతులకు ప్రయోజనం కల్పించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎంఎస్పీ కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మక్కజొన్న కొనుగోలుకు ఎన్ ఏ ఫెడ్, ఎన్ సీసీఎఫ్ సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖను కోరారు. పత్తి కొనుగోలు విషయంలో సీసీఐ ప్రతిపాదించిన ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి నిర్ణయం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. %ా1, ా%2 మరియు స్పాట్ బుకింగ్ విధానములో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు ఇది మరో రకంగా ఇబ్బంది పెట్టె చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికే మొంథా తుఫాను ప్రభావంతో పత్తి పంట దెబ్బతిన్న పరిస్థితుల్లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తేమ శాతాన్ని సడలించాలని అదేవిధంగా ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని, మంత్రి తుమ్మల గారు కేంద్ర టెక్స్టైల్స్ మంత్రి మరోసారి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. రైతులకు కొనుగోలులో ఏర్పడుతున్న ఇబ్బందులు అధిగమించేందుకు, దిగుబడి నష్టాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్షలాది చిన్న రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఢిల్లీకి వెళ్ళిన ముఖ్యమంత్రి ఢిల్లీలో ఈ విషయంపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరడం జరిగిందని తెలిపారు.

జనవరిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర - హైదరాబాద్ :: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహా సభలను వచ్చే సంవత్సరం జనవరి చివరి వారం లో నిర్వహించాలని సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది. మహాసభల నిర్వహణ కోసం సీనియర్ జర్నలిస్ట్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు పి.రాంచందర్ కన్వీనర్ గా నియమించింది. మరో 23 మందితో అడహక్ కమిటీని ఏర్పాటు చేసింది. గురువారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ పిల్లి రాంచందర్ అధ్యక్షతన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ, ఉపాధ్యక్షులు జి. మాణిక్ ప్రభు, తాటికొండ కృష్ణ, గుడిగ రఘు, బి. రాజశేఖర్, కార్యదర్శులు ఎస్కె సలీమ, ఈ చంద్రశేఖర్, బి. జగదీష్, కొప్పు నిరంజన్, బి. దయాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మణిమాల, విజయ, బీవీఎస్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, స్టేట్ కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్, అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్లు, ఇండ్లస్థలాలు, హెల్తాకార్డుల విషయంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. మామిడి సోమయ్య, బండి విజయ్కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాన్ని విస్తృతస్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. బహిష్కరణకు గురైన వారికి ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. ఏకపక్షంగా సోమయ్య వేసిన జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నట్టు విస్తృత కార్యవర్గం ప్రకటించింది.

అడహక్ కమిటీ కన్వీనర్‌గా రాంచందర్

అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలపై సర్కారుకు వినతులు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర-హైదరాబాద్ : జిల్లాలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష సజావుగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి, ఈ.వెంకటాచారి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల జరగబోయే ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (మెయిన్) పరీక్ష నిర్వాహణపై జరిగిన సమావేశంలో స్టేట్ అబ్జర్వర్ జె. పవిత్రన్ కుమార్ ఐఆర్ఎస్ తో జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొని వెన్యూ సూపర్వైజర్, లోకల్ ఇంస్పెక్టింగ్ ఆఫీసర్, లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు సూచించారు. యు.పి.ఎస్.సి నిర్వహించే ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (మెయిన్) పరీక్ష, 2025 ఈ నెల 16న అలాగే 18 నుండి 23వరకు ఏడు రోజులు జరగనుందని తెలిపారు. ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గం.ల నుండి 5:30 గం.ల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు హైదరాబాద్ దిల్ సుఖ్ నగర్ లోని నోబుల్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ సెంటర్ కేటాయించగా, అందులో 227 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. యు.పి.ఎస్.సి ఆదేశాల మేరకు ఈసారి పరీక్షా కేంద్రాలలో ఆన్లైన్ ఫేస్ ఆథెంటికేషన్ సిస్టం అమలు చేయడం జరిగిందని,ఈ ప్రక్రియపై యు.పి.ఎస్.సి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెన్యూ సర్వీసర్లు, మరియు ఇన్విజిలేటర్లను అవగాహన కల్పించారు. కావున ఫ్రిస్కింగ్ అనంతరం ప్రతీ సెషన్ ముందు ఆన్లైన్ యాప్ ద్వారా అభ్యర్థులను ధృవీకరించి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. తదుపరి లైన్ డిపార్టుమెంట్లకు సూచనలు అందజేశారు. పరీక్షా కేంద్రం పారిశుద్యంపై జి.హెచ్.ఎం.సి, ఫ్రిస్కింగ్, ప్రశ్నా పత్రాల, అభ్యర్థుల రవాణాపై పోలీస్, ఆర్.టి.సి, రూట్ ఆఫీసర్, నిరంతర విద్యుత్ సరఫరాపై టి.జి. ఎస్.పి.డి.సి.ఎల్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో ఏ.సి.పి. (హైదరాబాద్ సిటీ) కె.సత్యనారాయణ, ఏ.సి.పి (ట్రాఫిక్) వి.చంద్ర కుమార్, వెన్యూ సూపర్వైజర్ ఆర్.పి.ఎస్.విఠల్, లోకల్ ఇంస్పెక్టింగ్ ఆఫీసర్, కె.మహేశ్వర్, రూట్ ఆఫీసర్ ఓం కుమార్, సూపర్ వైజర్ మొహమ్మద్ రహీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివి మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనుగుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉన్నా.. పంపిణీలో జాప్యం ఎందుకు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర, పటాన్ చెరువు: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి ప్రతి రోజు స్వచ్ఛ జలాలు అందించాల్సిన గ్రామీణ నీటిపారుదల విభాగం అధికారులు నీటి పంపిణీ అంశంలో ఘోరంగా విఫలం అవుతున్నారని. ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచినీరు సరఫరా అవుతున్నాయని ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం పటాన్ చెరువు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ మరియు గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్ డబ్ల్యూ ఎస్) అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం, లకడారం, ఇస్నాపూర్, పాశమైలారం, క్యాసారం, చిట్కుల్, తెల్లాపూర్ పరిధిలోని పోచారం, ఇంద్రేశం పరిధిలోని బచ్చుగూడ, ఇంద్రేశం, రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఐనోలు, అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్పూర్, వడకపల్లి, దాయర తదితర గ్రామాలకు గత రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సక్రమంగా మంచినీరు పంపిణీ కావడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనిషి జీవనానికి అత్యంత కీలకమైన తాగునీటిని అందించడంలో విఫలమైతే ప్రజలు నమ్ముకుని ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు.

సింగూరు, కాళేశ్వరం రిజర్వాయర్లలో మంచినీటి నిల్వలు సరిపడా ఉన్నప్పటికీ పంపిణీ అంశంలో ఎందుకు విఫలమైతున్నారని అధికారులను ప్రశ్నించారు. ఇదే అంశంపై గతంలోనూ సమీక్ష సమావేశాలు నిర్వహించిన మార్పు రాకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచి నీరు విడుదల అవుతున్నాయని.. ప్రజలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు.

పాశమైలారం పారిశ్రామిక వాడకు మాత్రం నిరాటంకంగా మంచినీరు సరఫరా అవుతున్నాయని. ప్రజలకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమకు నీళ్లు అందించడానికి తాము వ్యతిరేకించడం లేదని ప్రథమ ప్రాధాన్యతగా ప్రజలకు అందించిన తర్వాతనే మిగతా విభాగాలకు అందించాలని ఆయన అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయ లక్ష్మి, డీఈలు హరీష్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ కార్యాలయ బులెటిన్ రాజ్యాంగ విరుద్ధం: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ :: పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్దమని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన తాజా బులెటిన్‌పై తీవ్రంగా స్పందించారు. లెజిస్లేటివ్ ట్రిబ్యునల్‌లో ఫిరాయింపుల కేసుపై విచారణ జరుగుతున్న సందర్భంలో, స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ ద్వారా మీడియా, సందర్శకులు, మాజీ ప్రజాప్రతినిధులపై అసెంబ్లీ ప్రవేశ నిషేధం విధించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. అంతేకాదు, ఈ కేసులో వాదిస్తున్న అడ్వకేట్లు కూడా సెల్ ఫోన్లు తీసుకురావద్దని ఆదేశించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ విచారణల్లో కూడా మొబైల్ ఫోన్లు అనుమతిస్తారు. మరి ఈ విచారణలో ఎం గూడుపుఠాణీ నడుస్తుంది?" అని ప్రశ్నించారు. ఇది స్పీకర్ వ్యక్తిగత నిర్ణయం కాదు, రేవంత్ రెడ్డి ప్రణాళికబద్ధంగా చేసిన చర్యగా అభివర్ణించారు. దొంగలు ఊర్లు పంచుకున్నట్టు వ్యవహారం సాగుతోందన్నారు. బులెటిన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పీకర్ కి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఫిరాయింపుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించాలి. తమ నియోజకవర్గ ప్రజలకు వారి ఎమ్మెల్యేల ఫిరాయింపులపై వాదనలు తెలుసుకునే హక్కు ఉంది," అని డాక్టర్ శ్రవణ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అధోగతికి చేరింది. రాష్ట్ర బడ్జెట్‌లో 2.30 లక్షల కోట్లు ప్రతిపాదించినా, సెప్టెంబర్ నాటికి కేవలం 76 వేల కోట్లు మాత్రమే రియలైజ్ అయ్యాయని అంటే 33 శాతం మాత్రమే అని పేర్కొన్నారు. రెవెన్యూ వసూళ్లలో 40 శాతం, జీఎస్టీ వసూళ్లలో 42 శాతం, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌లో 32 శాతం మాత్రమే సాధించారన్నారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని, ఎక్సైజ్ ఆదాయం కూడా 35 శాతం లోపే ఉందన్నారు. అయితే అప్పులు మాత్రం 83 శాతానికి చేరాయని, ప్రస్తుతం రూ.4.87 లక్షల కోట్ల అప్పు చేశారు. వీటికి తోడు మరో లక్ష కోట్లు బడ్జెట్‌కు సంబంధం లేని అప్పులు తెచ్చారన్నారు. ఇన్ని కోట్ల అప్పులు తెచ్చి పీకింది ఏమీ లేదు. ఇది రేవంత్ ఆర్థిక అత్యాచారం తప్ప మరేమీ కాదు అని వ్యాఖ్యానించారు. కాగ్ డేటా రేవంత్ రెడ్డి పాలన యొక్క బట్టలు విప్పేసింది. అనుభవం లేని సీఎం ఉంటే రాష్ట్రం ఇంత దిగజారడం సహజమే. హైడ్రా పేరిట, ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట ప్రజలపై దోపిడీ జరుగుతోంది. ఇలాంటి పాలనతో రేవంత్ ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. జూబ్లీహిల్స్ లో బోగస్ ఓటింగ్‌ను ప్రత్యక్షంగా చూశామని, పోలీసులు బోగస్ ఓటింగ్‌కు సహకరించారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో పాటు ఎంఐఎం కూడా అక్రమాలకు పాల్పడిందని, ఎంత అక్రమాలు చేసినా ధర్మమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సతీష్ రెడ్డి, హరి రమా దేవి, కల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

బాలలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయుడిని స్మరించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని బాల బాలికలందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. బాలలను జాతి సంపదగా భావించి వారి మెరుగైన భవితవ్యానికి కృషి చేయాలన్న నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. చదువుతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- దుండిగల్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో పార్క్, దేవాలయాభివృద్ధికి కృషి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు.గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్ 11వ బ్లాక్ ఇళ్ల సముదాయాల వాసులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలోని ఖాళీ స్థలంలో పార్కు నిర్మాణంతో పాటు దేవాలయాన్ని నిర్మింప చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ బిఆర్ఎస్ అధినేత,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని,ఇప్పటికే కుత్బుల్లాపూర్ లోని అనేక డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు.రానున్న రోజుల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహ్లాదకర,ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు పార్కు నిర్మాణంతోపాటు,దేవాలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ 11వ బ్లాక్ అధ్యక్షులు వినోద్ నాయక్, కమిటీ సభ్యులు రాజు,చాంద్, గౌస్,గజేంద్ర,జావిద్,మిథున్,దీపిక,సునీత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎస్సీ,ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో
లైజాన్ సెల్ మొదటి వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి కంపెనీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్ల పరిరక్షణ, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం ఒక ప్రత్యేక లైజాన్ సెల్ ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్న నేపథ్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించామని అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు వార్షికోత్సవాన్ని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో గురువారం జరుపుకున్నారు. లైజాన్ సెల్ ఏర్పాటు కోసం గతంలో తమతోపాటు ఎస్టి అసోసియేషన్ నేతలు భూక్యా నాగేశ్వరరావు, పంతులు, భాస్కర్ ల ఆధ్వర్యంలో నేషనల్ కమిషన్ అధికారులు అనంత నాయక్, హుస్సేన్ నాయక్ లతోపాటు స్టేట్ కమిషన్ చైర్మన్ వెంకటయ్యలకు అనేక సార్లు వినతి పత్రాలు సమర్పించినట్లు గుర్తు చేశారు. తమ డిమాండ్ ఫలితంగా 2024 డిసెంబర్ 12 న అధికారికంగా ఎస్సీ, ఎస్టీ లైజాన్ సెల్ ఏర్పాటు చేయడం జరిందన్నారు. ఈ సందర్భంగా తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ వార్షికోత్సవంలో ముఖ్య అతిథులుగా సింగరేణి ఈ అండ్ ఎమ్ డైరెక్టర్ తిరుమలరావు, జనరల్ మేనేజర్లు (ఫారెస్ట్) సైదులు, వెంకటేశ్వర్లు (సివిల్), ఏజియం అజయ్, లైజాన్ సెల్ ఇన్‌ఛార్జ్ శ్రావణ్, కార్పొరేట్ ఏరియా లైజాన్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, కొత్తగూడెం ఏరియా లైజాన్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏఐటియుసి నేత వంగ వెంకట్, త్యాగరాజన్, పితాంబరం లు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రావు, జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు, సెంట్రల్ కమిటీ సభ్యులు రామ్ సింగ్, ఏరియా ప్రెసిడెంట్ శ్రీనివాస్, హానరరీ ప్రెసిడెంట్ లింగ, సభ్యులు వీరన్న, అనిల్, సర్వన్, రామారావు, అనేకమంది గిరిజన, హరిజన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ, తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ మరియు తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ 2025 సీజన్ కోసం సమగ్ర భాగస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అవగాహన ఒప్పందం పై అధికారికంగా సంతకం చేశాయి. ఈ భాగస్వామ్యం పాలన, బ్రాండింగ్, వాణిజ్య కార్యకలాపాలు మరియు సాంకేతిక పర్యవేక్షణ వంటి అంశాలను కవర్ చేస్తుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, రాష్ట్రంలో మొదటిసారిగా అధికారికంగా నిర్వహించబడబోయే కళాశాల స్థాయి బాస్కెట్‌బాల్ లీగ్ ం తెలంగాణ కాలేజ్ బాస్కెట్‌బాల్ లీగ్ ం వోక్సెన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రకటించబడింది. ఇది తెలంగాణలో కళాశాల బాస్కెట్‌బాల్ అభివృద్ధికి ఒక చారిత్రాత్మక ముందడుగుగా నిలిచింది. ఈ అవగాహన ఒప్పందం మరియు లీగ్ ప్రారంభ కార్యక్రమానికి డా. రౌల్ విల్లామరిన్ రోడ్రిగ్స్, ఉపాధ్యక్షుడు, వోక్సెన్ యూనివర్శిటీకి శ్రీ విశాల్ కె., హెడ్ ఆఫ్ స్పోర్ట్స్, వోక్సెన్ యూనివర్శిటీకి శ్రీ ఆర్. శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఎ. పృథ్వీశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ హాజరయ్యారు.

రిజర్వేషన్లపై స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వం వెంటనే ఈ రిజర్వేషన్లను ఆమోదించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపుమేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలనే డిమాండ్‌తో గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బీసీ జేఏసీ నాయకులు ధర్మ పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్మ పోరాట దీక్ష శిబిరాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు.కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్మ పోరాట దీక్షలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్,జిల్లా మహిళా కన్వీనర్ సిరవేన స్వప్న,జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల సరఫరాపై ఎమ్మెల్యే ఆగ్రహం

విశాలాంధ్ర - ఇల్లందు : ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో రైతులను అన్ని విధాల ఆదుకోవాలని అనేక పథకాలు మంజూరు చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. చేప పిల్లలు సరఫరా చేయడంతో ఫిషరీస్ ఏడి మహమ్మద్ ఇంతియాజ్‌పై ఎమ్మెల్యే మండిపడ్డారు. చేప పిల్లల సైజు చాలా తక్కువ ఉందని గ్రహించి నియోజకవర్గానికి వీటిని పంపిణీ చేయొద్దని తిరిగి తీసుకెళ్లి పోవాలని తేల్చి చెప్పారు. చిన్న సైజు చేప పిల్లలు పెద్ద చేపలకు ఆహారంగా మారుతాయ న్నారు. దీని మూలంగా ప్రభుత్వ లక్ష్యం నీరు కారుతోందని చెప్పారు. ఏడిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామన్నారు.

సీపీఐ వందేళ్ల సభను జయప్రదం చేయండి

ముప్పాళ్ల, జంగాల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ఖమ్మంలో జరిగే సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ శత వసంతాల మహోత్సవాలను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామని, డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షల మందితో ముగింపు సభ కూడా జరుపుకోబోతున్నామని, ఈ వందేళ్ల కాలంలో సీపీఐ సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. సీపీఐ గుంటూరు నగర సమితి సమావేశం నగర నాయకులు దేవానాయక్ అధ్యక్షతన స్థానిక మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల మాట్లాడుతూ యువతకు మంచి భవిష్యత్తు కావాలన్నా... విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలన్నా... రైతు ఆత్మహత్యలు లేని వ్యవస్థ నిర్మాణం జరగాలన్నా... కార్మికులకు న్యాయమైన వేతనాలు అందాలన్నా అది ఒక్క ఎర్రజెండా వల్లే జరుగుతుందని చెప్పారు.

కేంద్రంలోని బీజేపీ సర్కార్ దేశ రాజకీయాలను, ప్రజలను తమ స్వప్రయోజనాల కోసం విభజించే యత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ ప్రజలకు వాస్తవాలు తెలియజేసి చైతన్యపర్చాలన్నారు. దేశంలో సామాజిక విప్లవం తీసుకురావడంలో సీపీఐని మించిన శక్తి మరొకటి లేదన్నారు. ఆర్థిక దోపిడి, కులపీడన లేని సమాజ నిర్మాణం కోసం లక్షలాది మంది కమ్యూనిస్టు యోధులు తమ జీవితాన్ని అంకితం చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికవర్గ శ్రమకు తగ్గ వేతనం, మహిళలకు సంపూర్ణ స్వేచ్ఛ కలిగిన సమాజం కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు ప్రజలకిచ్చిన హామీలను తుంగలోతొక్కిందని మండిపడ్డారు. వంద రోజుల్లో నిత్యావసర ధరలు తగ్గిస్తామన్న హామీని అటకెక్కించిందని, విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీసి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు చొప్పున వేస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. రకరకాల పేర్లతో పన్నుల భారాలను ప్రజలపై మోపిందని దుయ్యబట్టారు. మోదీ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రెట్టింపయ్యాయన్నారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయడానికి గుంటూరు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికైన జంగాల అజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. తొలుత సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ కుమార్తె వివాహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కుమార్తె సాయిలీల వివాహం సాయికృష్ణతో కేరళలోని కోవలం బీచ్‌లో ఉత్సాహపూరిత వాతావరణంలో గురువారం ఘనంగా జరిగింది. వివాహ కార్యక్రమానికి పార్టీ జాతీయ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం, కర్నాటక రాష్ట్ర కార్యదర్శి సాథి సుందరేశ్, కేరళ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్, రెవెన్యూశాఖ మంత్రి కె.రాజన్, ఆహార సరఫరా శాఖ మంత్రి అనిల్ కుమార్, ఎమ్మెల్యే లతాదేవి, చిత్ర దర్శకులు చంద్ర సిద్ధార్థ్ తదితర ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ బందరురోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో వెడ్డింగ్ రిసెప్షన్ ఉంటుందని కె.రామకృష్ణ తెలియజేశారు

'బిట్స్ అమరావతి' సలహాదారుగా వీఎస్ రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతిలో ఏర్పాటు కానున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీ-అమరావతి క్యాంపస్ సలహాదారుగా ప్రొఫెసర్ వజ్ఝా సాంబ శివరావు (వీఎస్ రావు) నియమితులయ్యారు. బిట్స్ పిలానీ రిజిస్ట్రార్ కల్నల్ సౌమ్యబ్రత చక్రవర్తి ఈ మేరకు నియామక పత్రాన్ని విడుదల చేశారు. బిట్స్ పిలానీలో అధ్యాపకుడిగా, అడ్మినిస్ట్రేటర్‌గా వీఎస్ రావు సేవల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. వీఎస్ రావు ఇటీవల సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. బిట్స్ అమరావతి క్యాంపస్ నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వ సహకారాన్ని కోరారు. కలసి ముందుకు సాగుదామని సీఎం ఆయనకు హామీ ఇచ్చారు. అమరావతి పరిధిలోని తుళ్లూరు గ్రామానికి చెందిన వీఎస్ రావు 45ఏళ్లు బిట్స్ పిలానీలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. 2020లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా, అదే వర్సిటీలో ముఖ్య సలహాదారుగా వ్యవహరించారు. బిట్స్ అమరావతి క్యాంపస్ సలహాదారుగా నియామకంపై వీఎస్ రావు హర్షం వ్యక్తంచేశారు. తుళ్లూరులో సేవలందించే అవకాశం లభించిందని, సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

పైలట్‌ను నివేదిక నిందించలేదు

సుప్రీం కోర్టుకు కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై విడుదల చేసిన ప్రాథమిక నివేదికలో పైలట్‌ను నిందించలేదని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ ఘటనపై 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' దర్యాప్తు బృందాన్ని అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎయిరిండియా ప్రమాదంలో మృతి చెందినవారిలో కెప్టెన్ సుమీత్, కో-పైలట్ క్లైవ్ కుందర్ కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ సుమీత్ తండ్రి పుష్కరాజ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం విచారణ కొనసాగించింది. 'ఏఏఐబీ దర్యాప్తు అనేది ఒకరిని నిందించేందుకు కాదు. మరోసారి అటువంటి తప్పిదం జరగకుండా ఉండటానికి కారణాన్ని వెలికితీసేందుకు ఉద్దేశించింది మాత్రమే' అని జస్టిస్ బాగ్చీ తెలిపారు. ఓ ఎన్జీవో తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ఈ దుర్ఘటనపై 'కోర్టు ఆఫ్ ఎంక్వైరీ' మాదిరి సమాంతర విచారణ నిర్వహించాలన్నారు. సంబంధిత విమానాలను నమ్మలేమని, వాటిలో ప్రయాణించేవారికి ప్రమాదం పొంచి ఉందని పైలట్ ఫెడరేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వాదనలు విమానయాన సంస్థల మధ్య పోరుగా మారకూడదని జస్టిస్ సూర్యకాంత్ వారించారు. సుమీత్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌కు

స్పందన తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై ఏఏఐబీ జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా... తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. దీంతో పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి.

పుల్వామా దాడి సూత్రధారి భార్యతో షాహీన్‌కు సంబంధాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీ పేలుడు ఘటన, అలానే పేలుడు పదార్థాల అక్రమ రవాణాలో జైష్ ఏ మహ్మద్ సంస్థకు ఉన్న సంబంధాలను దర్యాప్తు చేస్తున్న అధికారులకు సంచలన విషయం తెలిసింది. జైషే కమాండర్, పుల్వామా దాడి సూత్రధారి ఉమర్ ఫరూక్ భార్య అఫిరా బీబీతో ఉగ్రవాద అనుమానితురాలిగా అరెస్టైన డాక్టర్ షాహీన్ సయీద్‌కు సంబంధాలు ఉన్నట్లు కనుగొన్నారు. 2019లో జైషే మహ్మద్ ఉగ్రవాది సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌ని పేలుడు పదార్థాలు ఉన్న కారుతో ఢీ కొట్టిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడిలో 40 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి తర్వాత జైషే చీఫ్ మసూద్ అజర్ మేనల్లుడు ఉమర్ ఫరూఖ్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అతడి భార్యనే అఫిరా బీబీ. జైషే మహ్మద్ ఇటీవల తన ఉగ్ర ప్రణాళికలను మార్చుకుంటుంది. కొత్తగా మహిళా జీహాదీలను తయారు చేసేందుకు సిద్ధమైందని అధికారుల విచారణలో తేలింది. మహిళా ఉగ్రవాదుల కోసం 'జమాల్ అల్ మోమినాత్'ను ప్రారంభించిందని, ఢిల్లీ పేలుడుకు కొన్ని వారాల ముందు అఫిరా ఈ జిహాదీ గ్రూప్ సలహా మండలి షురాలో చేరారని భద్రతా సంస్థల దర్యాప్తులో వెల్లడైంది. మసూద్ అజర్ చెల్లెలు సాదియా అజర్‌తో కలిసి అఫిరా బీబీ పనిచేస్తోంది. వీరిద్దం ఢిల్లీ పేలుడు కుట్రతో సంబంధం ఉన్న షాహీన్ సయీద్‌తో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో సీనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న షాహీన్ సయీద్ కారులో అస్సాల్ట్ రైఫిల్స్, ఇతర మందుగుండు సామగ్రి దొరడంతో ఆమెను అరెస్టు చేశారు. జమాత్-ఉల్-మోమినాత్ భారత విభాగాన్ని ఏర్పాటు చేయడం, ఉగ్రవాద కార్యకలాపాల కోసం తీవ్రవాద మహిళలను నియమించడం వంటి బాధ్యతలను షాహీన్ సయీద్‌కు అప్పగించినట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. లక్నోకు చెందిన షాహీన్ సయీద్, అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో చేరడానికి ముందు అనేక మెడికల్ కాలేజీల్లో పనిచేశారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం ఆమె సెప్టెంబర్ 2012 నుండి డిసెంబర్ 2013 వరకు కాన్పూర్‌లోని ఒక వైద్య కళాశాలలో ఫార్మకాలజీ విభాగాధిపతిగా పనిచేశారు. ఆమె పాస్‌పోర్ట్ వివరాల ప్రకారం ఆమె 2016 నుండి 2018 వరకు రెండేళ్ల యూఏఈలో నివసించినట్లు వెల్లడైంది.

స్త్రీ శక్తికి రూ.400 కోట్లు

జీరో టికెట్ల మొత్తం ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా స్త్రీ శక్తి పథకానికి (ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్టు నుంచి ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రతి మహిళకూ ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ఆగస్టు 15 నుంచి అక్టోబరు వరకు ఈ పథకానికైన ఖర్చునూ ఆర్టీసీకి చెల్లిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీజేసింది. మహిళల జీరో ఫేర్ టికెట్ల ఖర్చుకు సంబంధించిన రూ.400 కోట్ల అదనపు నిధుల్ని చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసింది. రెండున్నర నెలల్లో మహిళలకు టికెట్లు జారీ చేసిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించింది. రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీకి స్త్రీశక్తి నిధులు విడుదల చేయడంపై ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎంయూఏ, ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెలా దాదాపు రూ.250 కోట్ల నుంచి రూ.270కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడుతుందని ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.400 కోట్ల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూనే... భవిష్యత్‌లో డబ్బులు పెండింగ్‌లో పెట్టకుండా మొత్తం రాయితీ డబ్బులు ఆర్టీసీ ఖాతాకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న బస్సులు సంఖ్య చాలడంలేదని, అదనంగా కనీసం మూడువేల బస్సులు కొనుగోలుచేసి, ప్రస్తుతం ఖాళీలలో పది వేలమంది సిబ్బందిని అన్ని కేటగిరీలలో నియమిస్తే ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు.

జోగి రమేశ్ రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నకిలీ మద్యం తయారీ, సరఫరాలో నమోదైన కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ రిమాండ్‌ను ఈ నెల 25 వరకు ఎక్సైజ్ కోర్టు పొడిగించింది. ఆయనతో పాటు ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్ రావుకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని కోర్టు తెలిపింది. ఈ మేరకు గురువారం వర్చువల్‌గా విజయవాడ కోర్టు న్యాయమూర్తి ఎదుట వీరిరువురినీ అధికారులు హాజరుపరిచారు. అయితే సిట్ అధికారులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్ల విచారణను ఈనెల 17కి వాయిదా వేస్తున్నట్టు న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను కూడా ఈ నెల 20కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. మరోవైపు ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్ నాయుడు బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. అయితే... ఈ కేసుపై ఈనెల 17న మరోసారి విచారణ చేపట్టనున్నట్టు న్యాయస్థానం వెల్లడించింది.

పవన్‌పై మిథున్‌రెడ్డి ఆగ్రహం

అటవీ భూముల కబ్జా వివాదం...

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అక్రమాలపై పవన్ చేసిన ఆరోపణలను నిరూపించాలంటూ ఆయన ఎక్స్‌లో సవాలు విసిరారు."గతంలో ఎర్రచందనం అంశంపై మీరు చేసిన వ్యాఖ్యలు మీకే గుర్తుండాలి. మీరు హెలికాప్టర్ నుంచి చూపించిన భూమి మా కుటుంబానికి చట్టబద్ధమైన సొత్తు. మేము ఆ భూమిని 2000లోనే కొనుగోలు చేశాం" అని మిథున్‌రెడ్డి అన్నారు. ఇక మంగళంపేట పరిధిలోని అటవీ భూముల కబ్జాపై ఉప ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. సుమారు 76.74 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైందని, ఈ వ్యవహారంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధం ఉందని పవన్ ఆరోపించారు. అటవీ భూముల కబ్జాపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికారులను పవన్ ఆదేశించారు. అటవీ భూముల వివరాలను డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఉంచాలని, ప్రతి కబ్జాపై పూర్తి వివరాలు సేకరించి, విజిలెన్స్ రిపోర్ట్, న్యాయ నిపుణుల సలహాలతో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

లారీల మధ్య నలిగిన కారులో మంటలు

8 మంది దుర్మరణం - పూనేలో ఘటన

పూనే: మహారాష్ట్రలోనని పూనేలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అదుపుతప్పిన లారీ బీభత్సం సృష్టించింది.

కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లి మరొక లారీని ఢీకొట్టింది. దీంతో మధ్యలో చిక్కుకున్న కారులో మంటలు చెలరేగి, అందులోని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో 15 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గురువారం సాయంత్రం పూనే-బెంగళూరు హైవేలోని నవాలే వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. వేగంగా వచ్చిన కంటైనర్ లారీ వాహనాలపైకి దూసుకెళ్లి మరో లారీని ఢీకొట్టింది. వాటి మధ్య కారు చిక్కుకోవడంతో మంటలు చెలరేగి ప్రాణ నష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. అత్యంత రద్దీగా ఉండే రోడ్డులో ఈ ఘటన జరిగింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మాజీ సీఎం కుమారుడి ఆస్తుల జప్తు

ఛత్తీస్‌గఢ్ మద్యం కేసులో ఈడీ చర్యలు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మద్యం కేసులో మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ కుమారుడు చైతన్యకు చెందిన రూ.61.20కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. రూ.59.96కోట్ల విలువైన 364 ప్లాట్లు, సాగు భూమి సహా స్థిరాస్తులు... బ్యాంక్ బ్యాలెన్స్, స్థిర డిపాజిట్లతో సహా రూ.1.24కోట్ల విలువైన చరాస్తులు స్వాధీనం చేసుకుంది. మద్యం కుంభకోణంపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈడీ ఈ చర్యలు తీసుకున్నది. రూ.2500కోట్ల విలువైన మద్యం సిండికేట్‌లో చైతన్యకు కీలకపాత్ర ఉన్నట్లు పేర్కొంది. నిధుల సేకరణ, పంపిణీకి సంబంధించిన ప్రధాన నిర్ణయాలన్నీ ఆయన ఆదేశాలతోనే తీసుకున్నట్లుగా ఆరోపించింది. అక్రమంగా సంపాదించిన ఆదాయాన్ని తన సంస్థ మెస్సర్స్ బాఘేల్ డెవలపర్స్ అధ్వర్యంలోని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ విఠల్ గ్రీన్ అభివృద్ధికి చైతన్య

ఉపయోగించారని తెలిపింది. ఈ ఏడాది జులై 18న చైతన్యను అరెస్టు చేసింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అనిల్ తుతేజా (మాజీ ఐఏఎస్), అరవింద్ సింగ్, త్రిలోక్ సింగ్ ధిల్లాన్, అన్వర్ ధేబర్, అరుణ్ పాటి త్రిపాఠి (ఐటీఎస్), కవాసి లఖ్మా (మాజీ ఎక్సైజ్ మంత్రి)ను ఈడీ అరెస్టు చేసింది. రూ,215కోట్ల స్థిరాస్తుల స్వాధీనంలో భాగంగానే తాజాగా ఆస్తులు జప్తు చేసినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది.

గ్రెనేడ్ దాడికి ఉగ్ర కుట్ర

లూధియానా: ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు... మరో ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పంజాబ్‌లో గ్రెనేడ్ దాడులకు కుట్ర పన్నిన నిందితులను అరెస్ట్ చేశామని లూధియానా పోలీసులు గురువారం వెల్లడించారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రోద్బలంతో గ్రెనేడ్ దాడికి సిద్ధమవుతున్న మాడ్యుల్‌ను పోలీసులు ఆదిలోనే అడ్డుకున్నారు. 10 మంది నిందితులను అరెస్ట్ చేశారు. మలేసియాలోని ఆపరేటర్ల ద్వారా నిందితులు కుట్ర పన్నినట్టు పోలీసులు తెలిపారు. పాక్‌లోని హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతూ హ్యాండ్ గ్రెనేడ్‌ల సేకరణ, డెలివరీ చేస్తున్నారని చెప్పారు. అధిక జనాభా ఉన్న ప్రాంతంలో గ్రెనేడ్ దాడి చేసి రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించేందుకు నిందితులు పథకం వేసినట్టు పంజాబ్ డీజీపీ తెలిపారు.

ఫలితాలు తారుమారైతే... బీహార్‌లో నేపాల్ తరహా అల్లర్లు

-ఆర్జేడీ నేత సునీల్ సింగ్ తీవ్ర వ్యాఖ్యలు...కేసు నమోదు

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం జరగనున్న నేపథ్యంలో ఆర్జేడీ నేత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బీహార్ ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తే... నేపాల్, బంగ్లాదేశ్ తరహా నిరసనలు పెద్ద ఎత్తున జరుగుతాయని ఆర్జేడీ నాయకుడు సునీల్ సింగ్ ఎన్నికల అధికారుల్ని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు ప్రజా తీర్పును దెబ్బ తీయవద్దని... అలా చేస్తే బీహార్‌లో అశాంతి నెలకొంటుందని హెచ్చరించారు. తమ పార్టీ అప్రమత్తంగా ఉందని, ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరించవద్దని సింగ్ కోరారు. '2020లో మా ఆర్జేడీ అభ్యర్థుల్లో చాలా మంది బలవంతంగా ఓడిపోయారని, ప్రజలు ఓట్లేసి గెలిపించాలనుకున్న వ్యక్తిని ఓడిస్తే... నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలకం తరహాలో రోడ్లపై పెద్ద ఎత్తున నిరసనలు కనిపిస్తాయి' అంటూ కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారుల్ని సునీల్‌సింగ్ హెచ్చిరించారు. ఆర్జేడీ 140 నుంచి 160 స్థానాలు గెలుచుకుంటుందని, తేజస్వీ యాదవ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని సునీల్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. లెక్కింపు ప్రక్రియలో ఏమైనా అవకతవకలు ఏర్పడితే, వాటిని ఎదుర్కొనేందుకు ఆర్జేడీ సిద్ధంగా ఉందని కూడా ఆయన స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా చేస్తే, సామాన్య ప్రజలు వీధుల్లోకి వస్తారని అన్నారు. కాగా సునీల్ సింగ్ ప్రజల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. 243 అసెంబ్లీ స్థానాలు గల బీహార్‌లో రెండు విడతల్లో ఎన్నికలు జరగ్గా...దాదాపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ ఎన్డీయే కూటమి మరోసారి గెలుస్తుందని తేల్చాయి. అయితే ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఎగ్జిట్ పోల్స్‌ను తోసిపుచ్చారు.

మీకు సిగ్గు అనిపించడం లేదా...

మీడియాపై సన్నీ డియోల్ ఆగ్రహం

ముంబై: బాలీవుడ్ నటుడు, ఎంపీ సన్నీ డియోల్... మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సహనాన్ని కోల్పోయి ... ముంబైలో తన ఇంటి ముందు వేచి చూస్తున్న మీడియా, ఫొటోగ్రాఫర్లపై అసహనాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు ధర్మేంద్ర ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. బ్రీచ్ క్యాండీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ధర్మేంద్రకు ఇంటి వైద్యం అందిస్తున్నారు. అయితే కవరేజీకి వెళ్లిన మీడియా... సన్నీ డియోల్ ఇంటి ముందే పడిగాపులు కాచింది. ఆ సమయంలో మీడియాను ఉద్దేశిస్తూ సన్నీ కాస్త ఆగ్రహానికి లోనయ్యాడు. చేతులు జోడించి మరీ సన్నీ డియోల్ మీడియాను తిట్టేశాడు. ఆప్ లోగోం కో షరమ్ ఆనే చాహియే.. ఆప్‌కే ఘర్ మే మా-బాప హై. అప్నే బచ్చే హై. షరమ్ నహీ ఆతీ (మీకు సిగ్గుగా అనిపించడం లేదా, మీకూ తల్లితండ్రులు, పిల్లలు లేరా, సిగ్గుగా ఎందుకు లేదు) అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నీ ఆగ్రహానికి చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. సోషల్ మీడియాలో చాలా మంది యూజర్లు సన్నీకి మద్దతు తెలిపారు. డియోల్ ఫ్యామిలీ ప్రైవసీని మీడియా గౌరవించడం లేదని కొందరు అన్నారు. ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆయన కూతురు ఈషా డియోల్ పేర్కొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు రంగాచార్యులు మృతి



పాతచిత్రం

విశాలాంధ్ర-హైదరాబాద్: సీనియర్ పాత్రికేయుడు మరింగంటి రంగాచార్యులు (74) గురువారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1975లో ఆంధ్రభూమిలో చేరిన ఆయన దాదాపు 30 ఏళ్ల పాటు అదే పత్రికలో కొనసాగారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం ఆల్వాల్ శ్మశానవాటికలో జరుగు తాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రంగా చార్యులు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలో జన్మించారు. ఆయనకు కుమార్తె, కుమారుడు. మరింగంటి కుమారుడితో సైనికపురిలో నివశిస్తున్నారు. ఆయన సతీమణి విజయ 1997లో కన్నుమూశారు. కోకిలం సాహితీ సాంస్కృతిక సంస్థతో ఆయనకు అనుబంధం ఉంది.

చిందేసిన సుధామూర్తి...వీడియో వైరల్

బెంగళూరు: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి భార్య సుధామూర్తి మరోసారి వార్తల్లో నిలిచారు. ఒక వివాహ వేడుకలో ఆమె చిందులేశారు. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మేనల్లుడు ఎరిక్ మజుందార్ రిసెప్షన్ బెంగళూరులోని ప్రముఖ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో

భాగంగా డప్పులు వాయించారు. ఆ డప్పులకు అనుగుణంగా సుధామూర్తి స్టెప్పులు వేశారు. ఆమెతో పాటు కిరణ్ మజుందార్ సైతం డ్యాన్స్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.

ఉగ్రవాదంపై పోరులో ముస్లింల ఐక్యత: సీఎఫ్ఎఫ్

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై పోరాటంలో ముస్లింలు ఐక్యంగా ఉన్నారంటూ ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట వద్ద పేలుడు ఘటనను సిటిజన్స్ ఫర్ ఫ్రెటర్నిటీ (సీఎఫ్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. భారతీయులు అందరికీ చెందిన వారసత్వ సంపద, మన దేశంపై జరిగిన హేయమైన చర్యగా పేర్కొంది. ఈ అమానవీయతను ముస్లింలుగా తామంతా ఆక్షేపిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఏ రకంగానూ ఉగ్రవాదానికి సహించబోమని తేల్చిచెప్పింది. ఇటువంటి నేరాలతో ఏ వర్గానికి, మతానికి ప్రత్యేకించి కశ్మీరీలకు మసి పెట్టరాదని కోరింది. భారత్‌లో అంతర్భాగంగా ఉన్న కశ్మీరీలు స్వయంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. ప్రకటనకర్తల్లో ఈసీ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ ఎస్‌వై ఖురేషి, ఏఎంయూ మాజీ వీసీ, మాజీ డిప్యూటీ ఆర్మీ చీఫ్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ జమీరుద్దీన్ షా ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, జామియా మిల్లియా ఇస్లామియా మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నజీబ్ జంగ్, పారిశ్రామికవేత్త, ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు సయీద్ ముస్తఫా, మాజీ ఎంపీ (రాజ్యసభ) షాహిద్ సిద్దిఖీ ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.